

కార్పొరేషన్‌లో ఏసీబీ కలకలం

నెల్లూరు(సిటీ), జనవరి 5 : నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏసీబీ కలకలం రేగింది. శుక్రవారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయానికి ఏసీబీ అధికా రుల బృందం వచ్చింది. కమిషనర్‌తో భేటీ అనంతరం ఇద్దరు రెవెన్యూ అధికారులను విచారణ నిమిత్తం వారి కార్యాలయానికి తీసుకెళ్లినట్లు తెలిసింది. వారిలో ఒకరు ఆర్వోకాగా మరొకరు ఆర్ఐ అని సమాచారం. మాగుంట లేవుట్‌లోని ఓ భవనానికి నిబంధనలు ఉల్లఘించి పన్ను వేశారన్న ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కాగా, ఏసీబీ అధికారుల రాకతో కార్పొరేషన్ ఉద్యోగుల్లో ఆందోళన రేగింది.





● నెల్లూరులో..



● కావలిలో..

ఇలపై రంగులు పోసినట్టు.. ప్రతి చుక్కా ముగ్గు కోసమే అన్నట్టు తెలుగు సంప్రదాయం ఒట్టిపడేలా నారీమణులు వేసిన రంగవల్లులు అందరినీ కట్టిపడేశాయి.

సంక్రాంతి పండుగ ముందే వచ్చిందా!? అన్నరీతిలో వేసిన ముగ్గులు ముచ్చట గొలిపాయి. ఏబీఎన్, ఆంధ్రజ్యోతి నిర్వహించిన కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు బెంగుళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన్ సారథ్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నెల్లూరులోని చందనా బ్రదర్స్, సీఎంఆర్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో శుక్రవారం ముత్యాల ముగ్గులు ఉత్సాహభరితంగా జరిగాయి. నెల్లూరు, కావలి, గూడూరు ప్రాంతాల్లో నారీమణులు భారీగా తరలివచ్చి వారిలోని సృజనాత్మకతను వెలికితీసి ముగ్గులు వేశారు. ప్రతి కేంద్రంలో ప్రథమ విజేతలకు పట్టు చీర, ద్వితీయ విజేతకు వర్క్ శారీ, తృతీయ విజేతకు డిజైనర్ శారీలతోపాటు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. అలాగే పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు.

మంత్ర ముగ్గులై..!

ఉత్సాహంగా 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' రంగవల్లుల పోటీలు ● నెల్లూరు, కావలి, గూడూరులలో నిర్వహణ

● విజేతలు వీరే..



నెల్లూరు : ప్రథమ విజేత సునీతకు బహుమతి అందజేస్తున్న కమిషనర్ వికాస్ మర్మత్, వాసు, పెంచలయ్య తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో జరిగిన రంగవల్లుల పోటీలకు మహిళలతోపాటు విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలు బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి, పి.సుజాత రెడ్డి, ఏటూరి పద్మ ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, చందనా బ్రదర్స్, సీఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ హరికృష్ణ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు.

● కావలి : పట్టణంలోని రైల్వే రోడ్డులో ఉన్న కరోనేషన్ రీడింగ్ రూమ్ ఆవరణలో జరిగిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. పోటాపోటీగా వేసిన ముగ్గులలో విజేతలను నిర్ణయించేందుకు న్యాయనిర్ణేతలు ఎంతో శ్రమించి వారి మెదడుకు పదునుపెట్టాల్సి వచ్చింది. చివరకు ఉపాధ్యాయిని, గాయకురాలు ఉమాశర్మ, సామాజిక కార్యకర్త పార్వతీశంకర్‌లు విజేతలను ఎంపిక చేశారు. ముఖ్య అతిథులుగా ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, శ్రీధర్ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ వైద్యురాలు ఝాన్సీ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



కావలి : ఆర్డీవో శీనానాయక్, కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ల నుంచి మొదటి బహుమతి అందుకుంటున్న విద్యాధరణి




2, 3వ విజేతలు జయ, అఖిల ఆదిశేషమ్మ

● గూడూరు : పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల మైదానంలో జరిగిన పోటీలకు మహిళలు తరలివచ్చి ఉత్సాహంగా ముగ్గులు వేశారు. న్యాయనిర్ణేతలుగా సునీత సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, సభ్యురాళ్లు మహిత, గ్రీష్మ పురోహిత్ వ్యవహరించి, విజేతలను ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పనుల ఒత్తిడిలో మహిళలు సతమతమవుతున్న తరుణంలో వారిలో ఉత్సాహాన్ని, సంప్రదాయ విలువలను, కళాత్మకతను వెలుగులోకి తెచ్చేందుకు ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమని ప్రసంశించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.



నెల్లూరు : ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు, న్యాయనిర్ణేతలు



గూడూరు : డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి నుంచి మొదటి బహుమతి అందుకుంటున్న ఝాన్సీరాణి




కావలిలో ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకుంటున్న వరలక్ష్మి, శ్రీదేవి



ద్వితీయ విజేత ఎన్.సుశ్మిత



తృతీయ విజేత ఆర్.యమున



గూడూరులో ముగ్గులు వేస్తున్న మహిళలు



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

అంగన్‌వాడీ-వేడి

25వ రోజూ కొనసాగిన సమ్మె ● ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ సంఘీభావం

నెల్లూరు (వైద్యం), జనవరి 5 : జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. శుక్రవారానికి వీరి సమ్మె 25వ రోజుకు చేరుకుంది. అన్ని ఐసీడీఎస్ కేంద్రాల వద్ద అంగన్‌వాడీ సిబ్బంది ధర్నా చేశారు. నెల్లూరులోని ఐసీడీఎస్ జిల్లా కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ నేతలు సంఘీభావం తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అంగన్‌వాడీల విషయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వైఖరి మారాలన్నారు. ఇన్ని రోజులుగా సమ్మె చేస్తుంటే సమస్యను సానుకూలంగా పరిష్కరించాల్సిన ప్రభుత్వం, విధుల్లోకి చేరాలని సిబ్బందికి నోటీసులు పంపించటం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణలో అంగన్‌వాడీలకు రూ.18వేలు ఇస్తున్నారని, ఆ మొత్తానికి జగన్ ఇచ్చిన హామీ మేరకు మరో వెయ్యి చేర్చి వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, నాగేంద్రరావు, ఎస్‌కే మౌలాలి. ఏవీఎస్ రెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ నేతలు కామాక్షమ్మ, రజనీ, మల్లెమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీలు

కందుకూరు వైసీపీలో కొనసాగుతున్న సస్పెన్స్

● ఎమ్మెల్యే మహీధరరెడ్డికి విజయసాయి ఫోన్?

కందుకూరు, జనవరి 5 : కందుకూరు వైసీపీలో నెలకొన్న సస్పెన్స్ కొనసాగుతోంది. టీడీపీ అగ్రనేతలు చంద్రబాబునాయుడు, లోకేష్‌లను వ్యక్తిగతంగా విమర్శించాలని, లేనిపక్షంలో టికెట్ విషయం పునరాలోచించాల్సి వస్తుందని అధికార పార్టీకి చెందిన నేతల ద్వారా సీఎం జగన్ మహీధరరెడ్డికి సమాచారం పంపిన విషయం తెలిసిందే. అయితే, ఇందుకు సున్నితంగా మహీధర్ రెడ్డి తిరస్కరించడంతో చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో వైసీపీలో నెం.2గా గుర్తింపు పొందిన విజయసాయిరెడ్డి నేరుగా మహీధరరెడ్డితో సంప్రదింపులు జరిపేందుకు కందుకూరు వస్తున్నారన్న సమాచారం శుక్రవారం ఉదయం వచ్చింది. ఈ విషయాన్ని కొందరు నాయకులు ఎమ్మెల్యేకు తెలపడంతో తనకు ఎలాంటి సమాచారం లేదని వారితో పేర్కొన్నారు. కాగా, ఆయన పర్యటన రద్దయినట్లు తెలియగా, 10 గంటల ప్రాంతంలో మహీధర్‌రెడ్డికి విజయసాయి ఫోన్ చేసినట్లు సమాచారం. వారి మధ్య ఏం సంభాషణ జరిగిందన్న విషయం బయటకు రాకపోయినా సీఎం జగన్ దగ్గరే ఉండి విజయసాయిరెడ్డి ఫోన్‌చేసి మాట్లాడినట్లు సమాచారం. ఆ తర్వాత ఎమ్మెల్యే గుడ్లూరులో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని సీఎం జగన్ పరిపాలనను కీర్తిస్తూ తన ప్రసంగాన్ని కొనసాగించారు

జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించు తల్లీ..!

● ఇరగాళమ్మకు మున్సిపల్ కార్మికుల పొర్లుదండాలు



నెల్లూరు(సిటీ), జనవరి 5 : ఇచ్చిన మాట నిలబెట్టుకుని, కార్మికుల హక్కులను కాపాడే విధంగా సీఎం జగన్‌కు మంచి బుద్ధిని ప్రసా దించు తల్లీ... అంటూ మున్సిపల్ కార్మికులు నెల్లూరు గ్రామదేవత ఇరగాళమ్మ గుడిలో పొర్లుదండాలు పెడుతూ నిరసన తెలిపారు. శుక్రవారం 11వ రోజు సమ్మెలో భాగంగా ఇరగాళమ్మ సన్నిధికి ఎదురుగా పొర్లుదండాలు పెట్టారు. వేపమండలతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు పెంచల నరసయ్య, కిన్నెర కుమార్, కామాక్షమ్మ మాట్లాడుతూ ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు ఎన్ని సమస్యలు ఎదుర్కొంటున్నా జగన్ ప్రభుత్వంలో కనీస స్పందన కనిపించడం లేదని విమర్శించారు. అనంతరం పాత మున్సిపల్ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నాయకులు కత్తి శ్రీనివాసులు, సూర్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మధ్యలోనే జంప్!

నటుడు ఆలీ ప్రసంగిస్తుండగానే వెళ్లిపోయిన జనం

రాపూరులో వెలవెలబోయిన సామాజిక బస్సు యాత్ర

రాపూరు, జనవరి 5 : అధికార వైసీపీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక బస్సు యాత్రకు జనం కరువవుతున్నారు. రాపూరులో శుక్రవారం సాయంత్రం సామాజిక బస్సు యాత్ర కార్యక్రమంలో భాగంగా జరిగిన బహిరంగ సభ ప్రజలు లేక వెలవెలబోయింది. ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుడు, నటుడు ఆలీ ప్రసంగిస్తుండగానే జనం ఒక్కొక్కరుగా లేచి వెళ్లిపోయారు. ఆ తర్వాత కర్నూలు ఎమ్మెల్యే అఫీజ్, నెల్లూరు మేయర్ స్రవంతి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నాగార్జునయాదవ్ తదితరులు ప్రసంగిస్తుం డగానే జనం వెళ్లిపోవడం తో ఖాళీ కుర్చీలు మిగిలాయి. అక్కడున్న అధికారు లు, పోలీసులు సభ నుంచి ప్రజలు వెళ్లనీయకుండా చేసేందుకు నానా తంటా లుపడ్డారు. మరోవైపు ఈ సభలో పాల్గొనేందుకు ఒక్కొక్కరికి రూ.300 నగదుతోపాటు క్వార్టర్ మద్యం సీసా ఇచ్చినట్టు సమాచారం. ఇంత చేసినా జనస్పందన లేకపోవడంతో వైసీపీ నాయకుల్లో అసహనం నెలకొన్నట్టు కనిపించింది.

వైభవంగా గోదాదేవి క్షేత్రోత్సవం



అమ్మవారి క్షేత్రోత్సవం

రాపూరు(డక్కిలి), డిసెంబరు 5 : పెంచలకోనలోన నృసింహస్వామి ఆలయంలో శుక్రవారం ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గోదాదేవికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం క్షేత్రోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా 6వ తేదీన స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా ఆలయంలో ఉదయం 4 గంటలకు తిరుప్పావై సేవ, 4-15కి గోమాత పూజ, 4-20కి బింది తీర్థం, 4-30కి అభిషేకం, 5-30కి చందనాలంకారం, 6 గంటలకు పూలంగి సేవ, 9 గంటలకు శాంతి హోమం, 11 గంటలకు స్వామి కల్యాణ మహోత్సవం, సాయంత్రం 6 గంటలకు బంగారు గరుడవాహన సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు.

డీఎస్‌బీసీయూ అధ్యక్షురాలిగా అరుణమ్మ

● ఉపాధ్యక్షుడిగా బత్తల కృష్ణయ్య



బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్న సాయికృష్ణ, ఆయన మద్దతుదారులు

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 5 : నెల్లూరు జిల్లా గొర్రెల ఉత్పత్తిదారుల సహకార సంఘం లిమిటెడ్(డీఎస్‌బీసీయూ) పాలకవర్గం అధ్యక్షురాలిగా గుమ్మడి అరుణమ్మ, ఉపాధ్య క్షుడిగా మత్తల కృష్ణయ్యలు ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి గట్టి పోటీ ఉంటుందని అందరూ భావించారు. అయితే ప్రారంభం నుంచే అరుణమ్మకు మద్దతు ఎక్కువ లభించడంతో ఎన్నిక ఏకపక్షమైంది. ఈ ఎన్నికలు శుక్రవారం నెల్లూరు రైల్వేఫీడర్స్ రోడ్డులోని జిల్లా పశుసం వర్ధకశాఖ కార్యాలయ ప్రాంగణంలో జరిగాయి. స్వల్ప వాగ్వివాదాలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. 36 మంది పోటీలో ఉండగా 124 మంది ఎన్నికల్లో వారికి మద్దతు తెలపాల్సి ఉంది. అయితే 109 మంది మాత్రమే హాజరయ్యారు. ఉదయం 11.30 గంటల సమయంలో ఎన్నికల అధికారి, జిల్లా సహకార శాఖాధికారి బీ సుధాభారతి అభ్యర్థులను అందరికీ పరిచ యం చేసి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. పోటీలో ఉన్న అభ్యర్థులను అధికారులు సమావేశ మందిరం బయట కూర్చోబెట్టారు. ఓటర్లను మాత్రం లోపల ఉంచారు. ఒక్కో అభ్యర్థిని లోపలికి పిలవడం, ఓటర్లు చేతులెత్తి వారి మద్దతు తెలియజేయడం జరిగింది. అయితే లోపలికి వచ్చిన అభ్యర్థి ఏ ప్యానెల్‌కు చెందిన వాడనే విషయం ఓటర్లకు అర్థంకాక గందరగోళానికి గురయ్యారు. ఎవరికి చేతులెత్తాలో తెలియక తికమకపడ్డారు. వచ్చిన ప్రతి అభ్యర్థికి కొంత మంది చేతులెత్తడం కొసమెరుపు. కాగా, ఎన్నికల ప్రక్రియ బ్యాలెట్ బాక్సు విధానంలో జరగాలని ఓ వర్గానికి చెందిన మేకల సాయికృష్ణ అతని మద్దతుదారులతో కలిసి ఎన్నికల అధికారిని ప్రశ్నించారు. ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకునే అధికారం తనకు లేదని ఎన్నికల అధికారి చెబుతున్నా వాగ్వివాదానికి దిగారు. పశుసంవర్థకశాఖ జాయింట్ డైరెక్టరు మహేశ్వరుడు, పోలీసులు జోక్యం చేసుకోవడంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది.



అధ్యక్షురాలిగా ఎన్నికైన గుమ్మడి అరుణమ్మ

● ఏకగ్రీవంగా ఎన్నికైన గుమ్మడి అరుణమ్మ

పోటీలో ఉన్న 36 మందిలో చేతులెత్తి ఎక్కువ మంది మద్దతిచ్చిన 12 మంది జాబితాను అధికారులు సిద్ధం చేశారు. వారి నుంచి అధ్యక్షఉపాధ్యక్ష పదివికి నామినేషన్ వేయాల్సి ఉంది. అయితే గుమ్మడి అరుణమ్మ, బత్తల కృష్ణయ్య మాత్రమే నామినేషన్లు వేయడంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారి సుధాభారతి ప్రకటించారు.

ఇద్దరు బలవన్మరణం

● ఆరోగ్య సమస్యలే కారణం? ● నెల్లూరు శివార్లలో ఘటన



ఆత్మహత్య చేసుకున్న భాస్కర్‌రెడ్డి


నెల్లూరు రూరల్, జనవరి 5 : నెల్లూరు శివార్లలోని కనుపర్తిపాడు వద్ద ఇద్దరు వ్యక్తులు బలవన్మరణానికి పాల్పడ్డారు. రూరల్ పోలీసులు అందించిన వివరాల మేరకు... కావలి సమీపంలోని రుద్రకోటకు చెందిన ఇనుకొల్లు భాస్కర్‌రెడ్డి (45) భార్య మరణించడంతో 20 ఏళ్లుగా గొలగమూడిలోనే మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఆరోగ్య సమస్యలు వేధిస్తుండటంతో తట్టుకోలేక పలుమార్లు ఆత్మహత్యకు యత్నించాడు. ఈ క్రమంలో గురువారం కావలికి వెళ్లున్నట్లు చెప్పి వచ్చిన ఆయన శుక్రవారం కనుపర్తిపాడు వద్ద నిర్జీవంగా కనిపించాడు. అతనికి సన్నిహితుడైన రమణయ్య గొలమూడిలోనే ఒంటరిగా ఉంటూ కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. అతను కూడా ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇద్దరు కలిసి మద్యం సేవించి, బిరియానీ తిని, పురుగుల మందు తాగి మరణించినట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తెలిసిందని పోలీసులు వెల్లడించారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు.

బాధితులతో మర్యాదగా వ్యవహరించాలి

● పోలీసులతో ఐజీ పాలరాజు

నెల్లూరు(క్రైం), జనవరి 5: పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గుంటూరు రేంజ్ ఐజీ జీ పాలరాజు పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. నెల్లూరులోని చిన్నబజారు పోలీసు స్టేషన్‌ను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఎఫ్ఐఆర్‌ల నమోదు, విచారణ, పలు అంశాల గురించి స్టేషన్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు త్వరలో రానున్నాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా బాధ్యతాయుతంగా పని చేయాలని ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రౌడీషీటర్లు, గత ఎన్నికల సమయంలో కేసుల్లోని నిందితులను బైండోవర్ చేయడం, లైసెన్స్‌డ్ ఆయుధాల డిపాజిట్, పోలింగ్ కేంద్రాల పరిశీలన జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ప్రసాద్, నగర, రూరల్ డీఎస్పీ లు డీ శ్రీనివాసరెడ్డి, పీ వీరాంజనేయరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు ఎం బాబీ, కల్యాణరాజు, సుబ్బారావు, పీవీ నారాయణ, వీరా నాయక్, చిన్నబజారు ఎస్ఐ సైదులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు



తీవ్ర గాయాలైన యువకుడు

సంగం, జనవరి 5 : రోడ్డుప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని సిద్దీపురం సమీపంలో ముంబయి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కోవూరుకు చెందిన యువకుడు మోటారుబైక్‌పై సంగం వైపు వస్తుండగా ఆత్మ కూరు నుంచి నెల్లూరు వెళ్తున్న కారు మార్గమధ్యంలో సిద్దీపురం పెంట్రోలు బంకు వద్ద రహదారికి అడ్డంగా వచ్చిన గేదెలను తప్పించబోయి ఎదురుగా వస్తున్న మోటారు బైక్‌ను ఢీకొంది. దీంతో మోటారు బైక్‌పై వస్తున్న యువకుడికి తీవ్రగాయాలు కాగా జాతీయ రహదారి అంబులెన్స్‌లో బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. యువకుడి వివరాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	90
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	170
స్కిన్‌లెస్	190
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5967
వెండి కిలో ధర	రూ. 73,500
వెండి ఒక గ్రాము	రూ. 75.50

రైలు ఢీకొని ఒకరి మృతి

నెల్లూరు(క్రైం), జనవరి 5: నెల్లూరు-వేదాయపాళెం రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని డీమార్ట్ సమీపంలో రైలు పట్టాల పక్కన మృతదేహాన్ని గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే ఎస్ఐ ఎన్ హరిచందన ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహంపై పింక్ రంగుపై తెలుపు రంగు డిజైన్ ఫుల్ హ్యాండ్స్ షర్టు, ఆరెంజ్ లుంగీ, మెరూన్ రంగు ఫుల్ డ్రాయర్ ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

ట్యాబ్‌లతో ఆర్భాటం !



నెల్లూరు (విద్య), జనవరి 5 :

'మొబైల్స్‌కు పిల్లలు దూరంగా ఉండాలి.. సెల్‌ఫోన్ వాడకంతో విద్యార్థులు పక్కదారి పడతారు.. ఎట్టి పరిస్థితుల్లోనూ వారి చేతికి సెల్‌ఫోన్ దొరకనివ్వవద్దు.. ఒకవేళ ఇచ్చినా వాటి వాడకంపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి'

- నిన్న, మొన్నటి వరకు సైకాలజిస్టులు, ప్రభుత్వ పెద్దలు, గురువులు చెబుతున్న మాటలు

- నెట్ సౌకర్యం, చార్జర్లు, క్యూఆర్ కోడ్,కంటెంట్ లేకుండా పంపిణీ
- వినియోగంలో విద్యార్థుల ఇక్కట్లు
- అటకెక్కుతున్న చదువులు
- పక్కదారి పడుతున్న టెక్నాలజీ
- రోజుకో సిలబస్..పూటకో జీవో
- తలలు పట్టుకుంటున్న ఉపాధ్యాయులు

అయితే ప్రస్తుతం పరిస్థితులు మారిపోయాయి. ఒకప్పుడు ఉపాధ్యాయుడు తరగతి గదిలోకి సెల్‌ఫోన్‌తో ప్రవేశిస్తే నేరం. ఇప్పుడు దాన్ని తీసుకెళ్లడం ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అంతటితో ఆగకుండా విద్యార్థులు కూడా సెల్‌ఫోన్‌లు తెచ్చుకోవాల్సిందేనని గతంలో ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఆన్‌లైన్ బోధన నేపథ్యంలో జగన్ ప్రభుత్వం బైజూస్ సంస్థతో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. ఇంతకాలం పరిమిత ఒప్పందాలతో సరిపెట్టిన ప్రభుత్వం తాజాగా ఎట్టి పరిస్థితుల్లోనూ ఆన్‌లైన్ విద్యాబోధన చేపట్టాల్సిందేనని ఆదేశాలు జారీ చేసింది. ట్యాబ్‌ల వినియోగంపై ప్రభుత్వం ఎలాంటి శిక్షణ ఇవ్వకుండా ఏకంగా 8వతరగతి విద్యార్థులకు వాటిని అందించింది. సక్రమ మార్గంలో వాటిని వినియోగిస్తే మంచిదే కానీ పక్కదారి పడితే ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే. జిల్లాలో ఇటీవల 19,168 ట్యాబ్‌ల పంపిణీ పై ప్రత్యేక కథనం.

● ఉపాధ్యాయుల ఆందోళన

రాష్ట్ర ప్రభుత్వం ప్రచార ఆర్భాటానికి పోయి బోధనను జటిలం చేస్తుండడంపై ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కంటెంట్ ఎలా ఉన్నా అసభ్యచిత్రాలను తిలకించకుండా పిల్లలను కనిపెట్టుకుని ఉండడం వారికి తలకు మించిన భారంగా మారుతోంది.వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమయిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకో కొత్తసిలబస్, పూటకో జీవోతో ఉపాధ్యాయులు కూడా తలలు పట్టుకుంటున్నారు. గత రెండేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తీవ్రంగా తగ్గిపోతున్నా వాస్తవ పరిస్థితులను దాచిపెడుతున్నారనేది గణాంకాలు చెపుతున్నాయి. ఇటీవల పంపిణీ చేసిన ట్యాబ్‌లను పరిశీలిస్తే వాస్తవాలు వెల్లడవుతున్నాయి. జిల్లాలోని 468 పాఠశాలల్లో ఉన్న 19,168 మంది విద్యార్థులకు ట్యాబ్‌లను అందచేసింది. ప్రభు త్వం వీటిపై దృష్టి సారించకుండా విద్య రంగాన్ని నాశనం చేస్తుందనే ఆరోపణలున్నాయి.

● తల్లిదండ్రుల్లో కలవరం

పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని, అవి వారి జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఓవైపు మానసిక నిపుణులు చెపుతున్నా, ప్రభుత్వమే నేరుగా ట్యాబ్‌లను వారికి అందించడంతో తల్లిదండ్రులు కలవర పడుతున్నారు. ట్యాబ్‌లలో విద్యార్థులు కంటెంట్ ఎంతసేపు చూస్తున్నారు, ఏమి చదువుకుంటున్నారన్న విషయాలతోపాటు ట్యాబ్‌లను జాగ్రత్తగా గమనించడం, పాడయితే మరమ్మతులు చేయించడం ఉపాధ్యాయులకు నిత్యకృత్యంగా మారింది. ఎక్కువమంది విద్యార్థులు పాఠశాలల్లో ట్యాబ్‌లను పక్కన పెట్టి నా, ఇళ్లకు వెళ్లిన తరువాత వారి ఇష్టానుసారంగా ట్యాబ్‌లను వాడేస్తున్నారని పలువురు తల్లిదండ్రులు చెపుతున్నా రు. గతంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తరగతి గదిలో ఉపాధ్యాయుడు బోధించే పాఠాలను శ్రద్ధగా వినడం, నోట్స్ రాసు కోవడం, ఇంటికెళ్లి చదువుకోవడం, తమ అభిప్రాయాలను ఉపా ధ్యాయులతో పంచుకోవడాన్ని విద్యార్థులు చేసేవారు. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా మారిపోయా యి. ఉపాధ్యాయుడికి బోధన సమయం దొరకడమే గగనంగా మారింది. ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చినప్పటి నుంచి రిజిస్టర్‌లు, యాప్‌లతో కుస్తీ పడడం, ఫొటోలను అప్ లోడ్ చేయడం, సమావేశాలకు హాజరు కావడంతోనే సమయమంతా గడిచిపోతోంది. ఈ నేపథ్యంలో అత్యధికశాతం విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల వైపు అడుగులు వేస్తున్నారని ఉపాధ్యాయులు అంటున్నారు.

పని చేయని ట్యాబ్‌లు

జిల్లాలో పంపిణీ చేసిన ట్యాబ్‌లకు అవసరమైన చార్జర్లు, క్యూఆర్ కోడ్, చిప్‌లు లేకుండానే పంపిణీ చేశారన్న విమర్శలున్నాయి. మరికొన్ని ట్యాబ్‌లలో కంటెంట్ లేకుండా ఇవ్వడంతో అవి అలంకారప్రాయంగానే మారాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మరోవైపు విద్యాసంవత్సరం నాలుగు నెలల్లో పూర్తవుతుండగా ప్రచార ఆర్భాటంతోనే ట్యాబ్‌లను పంపిణీ చేశారని, ఇచ్చిన వాటికి కూడా సరైన సామగ్రి అందలేదని వారు ఆరోపిస్తున్నారు. ట్యాబ్‌లు పంపిణీ చేసిన ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయం సరిగా లేక హెచ్ఎంలు, ఉపాధ్యాయులే తమ సొంత నిధులు వెచ్చించి ఇంటర్నెట్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఈ బాధ్యతను ఏపీ ఫైబర్ నెట్‌కు అప్పగించింది. సమస్యలను తెలియచేస్తే వారు స్పందించకపోవడంతో పాఠశాలల్లో ట్యాబ్‌ల వినియోగం కష్టతరంగా మారింది. దీంతో విద్యార్థులు ఇంటికెళ్లిన తరువాత వారి ఇంటర్నెట్‌ను విని యోగించుకుని ట్యాబ్‌లను వాడేస్తున్నారు. దీంతో వారి చదువులు కొండెక్కుతున్నాయి.

అమ్మవారి బంగారు కాసుల హారం మాయంపై విచారణ



విచారణ చేస్తున్న దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ చైతన్య

సంగం, జనవరి 5: మండలంలోని వంగల్లు భీమేశ్వరాలయ అమ్మవారి బంగారు కాసుల హారం మాయంపై దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ చైతన్య శుక్రవారం విచారణ చేపట్టారు. ఆలయంలోని క్షామాక్షిదేవికి చెందిన పురాతన 82 గ్రాముల బంగారు కాసుల హారం మాయమైన విషయం ఆలస్యంగా వెలుగుచూసిన విషయం విదితమే. దీనిపై ట్రస్ట్ బోర్డు చైర్మన్ రఘురామయ్య జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆలయానికి వచ్చి విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. ట్రస్టుబోర్డు కమిటీ ఆధ్వర్యంలో ప్రస్తుతం పనిచేస్తున్న ఈవో పెంచల ప్రసాద్‌తోపాటు గతంలో ఇక్కడ ఈవోగా పనిచేసిన రమేష్‌రెడ్డి, శ్రీలతను పిలిపించి అందరి సమక్షంలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డులు పరిశీలించామని, ఎవరెవరు, ఎప్పుడు లాకర్ తెరిచారో పరిశీలించి ఎవరి హయాంలో కాసుల హారం మాయమైందో నిర్ధారణ అయిన తరువాత జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు నివేదిక అందచేస్తామని తెలిపారు.

నేడు సీబీఆర్‌కు సోమశిల జలాలు విడుదల

● సోమశిల జేఈ రామారావు

జలదంకి, జనవరి 5: మండలంలోని చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)కు శనివారం నుంచి సోమశిల జలాలు విడుదల చేయనున్నట్లు సోమశిల ప్రాజెక్టు జేఈ రామారావు తెలిపారు. శుక్రవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కావలి కాలువ నుంచి బోగోలు మండలం ఎస్సీ పాలెం మేజరు వద్ద నుంచి జనవరి నెలలో రోజుకు 100 క్యూసెక్కులు, ఫిబ్రవరి నెలలో 150 క్యూసెక్కులు, మార్చి 31వ తేదీ వరకు రోజుకు 100 క్యూసెక్కుల వంతున సీబీఆర్‌కు విడుదల చేయనున్నట్లు తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు కొత్తగా వరినాట్లు వేయకుండా ఇప్పటికే నాట్లు వేసిన పొలాలకు నీటిని పొదుపుగా వాడుకుని పంటలు పండించుకోవాలని తెలిపారు. వ్యవసాయాధికారి శైలజ మాట్లాడుతూ వరి నాట్లు వేయని భూముల్లో ఆరుతడి పంటలైన నువ్వు, పెసర పైర్లు సాగు చేసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా గతంలో జరిగిన జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశంలో జలదంకి మండలానికి సోమశిల జలాలు కేటాయించలేదు. దీంతో రైతులు స్థానిక అధికారపార్టీ నాయకులు, అధికారులకు మొరపెట్టుకున్నారు. దీంతో స్పందించిన అధికార యంత్రాంగం నీటి విడుదలకు శ్రీకారం చుట్టింది. అయితే ప్రస్తుతం అధికారులు ప్రకటించిన విధంగా నీటిని విడుదల చేయడం వల్ల సీబీఆర్ పరిధిలోని ఆయకట్టు రైతులందరికీ పూర్తిగా సరిపోవని, అధికారులు స్పందించి రోజుకు 200 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

రూ. 1800కోట్లతో మధ్యాహ్న భోజన నిర్వహణ

● ప్రతి పిల్లవాడు బడిలో అన్నమే తినాలి ● రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి



మనుబోలు హైస్కూల్లో మధ్యాహ్న భోజనం రుచిచూస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి

మనుబోలు, జనవరి 5: ఏటా మధ్యాహ్న భోజనం నిర్వహణ కోసం ప్రభుత్వం రూ.1800 కోట్లు ఖర్చు పెడుతోందని, ప్రతి పిల్లవాడు పాఠశాలలో అందిస్తున్న భోజనం తినేలా ఉపాధ్యాయులు శ్రద్ధ పెట్టాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి తెలిపారు. ఆమె శుక్రవారం మండలంలోని మనుబోలు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను, మడమనూరు ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్షయపాత్ర పాఠశాలలకు అందిస్తున్న భోజనాన్ని ఆమె రుచిచూశారు. అనంతరం పిల్లలను భోజనం గురించి, కొత్త మెనూ గురించి గొప్పంగా అడిగి తెలుసుకున్నారు. వారు బాహాటంగా చెప్పలేకపోవడంతో చీటీలలో రాసి ఇవ్వాలని కోరారు. దీంతో విద్యార్థులు భోజనం రుచిగా ఉండడం లేదని, కొన్ని రోజుల్లో వచ్చే కూరలు సరిగా ఉండవని, కోడిగుడ్లు బాగాలేవని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆమె ఉపాధ్యాయులతో స్వయంగా, అక్షయపాత్ర నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

మనుబోలులోని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగి ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కేంద్రంలో పిల్లలు తక్కువగా ఉండడంతో ఆమె ప్రశ్నించారు. పిల్లలు రావడం లేదని, ఆయాలు లేకపోవడం, రికార్డులు లేక పిల్లలు ఎక్కడి నుంచి వస్తారో తెలియడం లేదని బదులిచ్చారు. కేంద్రంలో ఉన్న గర్భిణులు, బాలింతలకు టీహెచ్‌ఆర్, బాలామృతం ఫుడ్ కమిషన్ సభ్యురాలు చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారిణి గంగాభవాని, ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, డీడీలు రమేష్, వెంకటయ్య, డిఎస్‌వో వెంకటేశ్వర్లు, ఆహార నియంత్రణ అధికారులు నీరజ, వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ విజయలక్ష్మీ, ఇన్‌చార్జి ఎంపీడీవో జీవిఎస్‌వి ప్రసాద్, విఆర్‌వోలు నాగార్జునరెడ్డి, మురళీధర్, కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలు ద్వైవార్షిక నగదు మంజూరు



ద్వైవార్షిక నగదు మంజూరులో ఆనం అరుణమ్మ, అధికారులు

నెల్లూరు (హరనాథ పు రం); జనవరి 5 : నవరత్నాలు-ద్వై వార్షిక నిధుల మంజూరు కార్యక్రమాన్ని ముఖ్య మంత్రి జగన్ తాడేపల్లి లోని క్యాంపు కార్యా లయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించగా నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణం నుంచి జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు అందని వారు అర్హత ఉంటే సచివాలయాలను సంప్రదిస్తే వారికి పథకాల ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ మాట్లాడుతూ ద్వైవార్షిక నిధుల మంజూరులో భాగంగా జిల్లాలో వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు అందని సుమారు 12,218 మంది లబ్ధిదారులకు రూ.6.06 కోట్ల నగదును ముఖ్యమంత్రి నేరుగా వారి ఖాతాలకు జమ చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుమ్మూ ధూళితో రోగాల పాలవుతున్నా పట్టించుకోరా..!

● ఇసుక వాహనాలు అడ్డుకొని గ్రామస్థులు, రైతుల నిరసన



విరువూరు రీచ్ వద్ద ఇసుక వాహనాల ముందు నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

పొదలకూరు, జనవరి 5 : దుమ్మూ ధూళితో రోగాల పాలవుతున్నా ఎట్టించుకోవడంలేదని నిరసిస్తూ మండలంలోని విరువూరు గ్రామంలోని ఇసుక రీచ్ వద్ద శుక్రవారం గ్రామస్థులు, రైతులతో కలిసి వైసీపీ నాయకులు ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన ఎస్సీ కాలనీవాసులు ఇసుక రీచ్ నుంచి తమ కాలనీ మీదుగా వెళ్లే ఇసుక లారీలు, టిప్పర్‌లు, ట్రాక్టర్‌లను అడ్డుకొని వాటి ముందు ఉదయం నుంచి సాయంత్రం వరకు రిలే దీక్ష చేపట్టారు. ఇసుక రీచ్ నుంచి అధిక లోడింగ్‌తో వాహనాలు వెళ్లడంతో ఎర్రటి దుమ్ము ధూళితో తమ హరిజనవాడ, అరుంధతీయవాడలు మునిగిపోతున్నాయన్నారు. దీంతో తాము అనారోగ్యాలు పాలవుతున్నామని, ఈ బాటలో మూడు పూటలా నీళ్లు పట్టాలని సూచించినా రీచ్ నిర్వాహకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికార పార్టీకి చెందిన మాజీ ఏఎంసీ డైరెక్టర్ దశకంఠాద్రిశర్మ మాట్లాడుతూ ఇక్కడి ఇసుక రీచ్ నుండి అధిక లోడుతో వాహనాలు వెళుతుండడంతో రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నా యన్నారు. గతంలో తమ పంచాయతీకి రీచ్ నిర్వాహకులు ఇసుక రీచ్ తమ పంచాయతీ పరిధిలో ఉన్నందు వలన పంచాయతీ అభివృద్ధికి సీనరేజ్ చెల్లించేవారని, ప్రస్తుతం ఒక్క పైసా కూడా ఇవ్వడంలేదన్నారు. తమ గ్రామంలో డిగ్రీ, పీజీ చదివిన యువత ఉన్నారని వాళ్లకి రీచ్‌లో ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురు డిబార్

వెంకటాచలం, జనవరి 5 : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలలో నలుగురు విద్యార్థులు డిబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 155 మంది, మధ్యాహ్నం జరిగిన డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షలకు 604 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఉదయం మొదటి సెమిస్టర్ పరీక్షలలో కోవూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, నెల్లూరులోని వీఆర్ డిగ్రీ కళాశాలలో ఒకరు, వివేకానంద డిగ్రీ కళాశాలలో ఒకరు, మధ్యాహ్నం జరిగిన మూడవ సెమిస్టర్ పరీక్షలలో నెల్లూరులోని జగన్స్ డిగ్రీ కళాశాలలో ఒకరు మొత్తం నలుగురు విద్యార్థులు డిబార్ అయినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ శ్రీనివాసఆంజనేయమూర్తి

ఆత్మకూరు, జనవరి 5 : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే సిజిఆర్ఎఫ్ లక్ష్యమని చైర్మన్ వి శ్రీనివాసఆంజనేయమూర్తి, ఆర్థిక సభుడు కె రామ్మోహన్ రావు తెలిపారు. స్థానిక విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. వీటిని పరిశీలించి సత్వరమే సమస్యలను పరిష్కరించాలని స్థానిక విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ బి జనార్థన్ డిప్యూటీ ఈఈ సురేష్, ఫోరం సాంకేతిక, స్వతంత్ర సభ్యులు ఎస్ఎల్ ఆంజనికుమార్, జి ఈశ్వరమ్మ, ఏఈలు పాల్గొన్నారు.

మూడు ఇసుక టిప్పర్ల స్వాధీనం

కోవూరు, జనవరి 5: ఎలాంటి అనుమతులు లేకుండా పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను ట్రైనీ డీఎస్పీ హేమలత పట్టుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. శుక్రవారం మూడు టిప్పర్లలో ఇసుక తరలిస్తుండగా జమ్మిపాళెం ప్రాంతంలో ట్రైనీ డీఎస్పీ వాటిని తనిఖీ చేసి ఎలాంటి అనుమతి ప్రతాలు లేకపోవడంతో పోలీసుస్టేషన్‌కు తరలించారు. వాహనాల డ్రైవర్లపై కేసులు నమోదు చేశారు. అలాగే పెన్నానది తీరంలో ఇసు క తరలించేందుకు సిద్ధంగా ఉన్న రెండు ట్రాక్టర్లు, ఓ ఎక్స్‌కవేటరును స్వాధీనం పరచుకుని డ్రైవర్లతో సహా పోలీసుస్టేషన్‌కు తరలించారు.

సమస్యలు పరిష్కరించే వరకు అంగన్‌వాడీల సమ్మె ఆగదు

ఆత్మకూరు, జనవరి 5: సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం వారు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. ఈ క్రమంలో అటువైపు వెళుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కారును అడ్డగించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరీ, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

అనంతసాగరం: సమస్యల పరిష్కారం కోసం అనంతసాగరంలో శుక్రవారం అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. 25 రోజులగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. కార్యక్రమ ంలో సీఐటీయూ, ఆవాజ్ నాయకులు అన్వర్‌బాషా, మస్తాన్, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.


వరికుంటపాడు: ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఉదయగిరి రూరల్ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. డిమాండ్ల సాధనలో భాగంగా శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్ వాడీ నాయకురాళ్లు మహాలక్ష్మి, చాంద్‌బేగం, ప్రమీలా తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా శుక్రవారం మెడకు ఉరితాళ్లు బిగించుకొని చెట్టుకు వేలాడుతూ వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు షేక్ రజియా మాట్లాడుతూ కనీస వేతనం పెంచకపోతే నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక ఎమ్మార్వో కార్యాలయ ప్రాంగణంలో అంగన్వాడీలు దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ నాయకులు కోడె రమణయ్య, ఆదిలక్ష్మి, కుమారి, చంద్రమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె


పొర్లుదండాలతో నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆత్మకూరు, జనవరి 5 : మున్సిపల్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన సమ్మె 11వ రోజుకు చేరింది. ఈ క్రమంలో శుక్రవారం వారు తమ విధులను బహిష్కరించి స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద పొర్లుదండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు, ఏఐటీయుసీ మున్సిపల్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఏఎస్ పేట, జనవరి 5: హసనపురం, ఏఎస్ పేట గ్రామాలలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి దేవసేన ఏఎస్ పేట మండల వ్యవసాయ అధికారిణి రజినితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఇవో చిరంజీవి పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

ఆత్మకూరు, జనవరి 5 : పేదరిక నిర్మూలనే లక్ష్యం అని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం ఆత్మకూరు అర్బన్, రూరల్ పరిధిలోని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ జేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె మధులత, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్, మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు, చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందూరు వెంకటరమణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడ ఆదిశేషయ్య, అల్లారెడ్డి ఆనందరెడ్డి పాల్గొన్నారు.

చేజర్ల : ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి శుక్రవారం చేజర్లలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. చేజర్లలో రైతుభరోసా కేంద్రం ప్రారంభోత్సవం, జలజీవన్ పథకానికి శంకుస్థాపన, పింఛన్ల పంపిణీ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో ఎంపిపి తూమాటి విజయభాస్కర్ రెడ్డి, జెడ్‌పిటిసి పీర్ల పార్థసారది, సొసైటీ చైర్మన్ వీరరాఘవరెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు మైనారిటీ నాయకులు షేక్ సిరాజుద్దీన్, ఎంపిడివో కరీముల్లా, తహసీల్దారు పి క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలు దేశాభివృద్ధికి ఉపయోగపడాలి

ఉదయగిరి రూరల్: వ్యవసాయ రంగంలో చేసే ప్రతి పరిశోధన దేశాభివృద్ధికి ఉపయోగపడాలని ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి జే అంజయ్య, ఉదయగిరి సీఐ గిరిబాబులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్‌డే కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాలొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ టీ గోపికృష్ణ, కళాశాల విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

ఉదయగిరి రూరల్ : ప్రకృతి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో రైతులకు ప్రకృతి వ్యవసాయ సాగుపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి ప్రోత్సహించాలని డీఆర్సీ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవారం రైతు భరోసా కేంద్రంలో క్షేత్రస్థాయి సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ ఆశీర్వాదం, మండల యాంకర్ వెంకటలక్ష్మమ్మ, చందు తదితరులు పాల్గొన్నారు.

బాలామృతం పంపిణీ

వింజమూరు : పంచాయతీ పరిధిలో నాలుగవ సచివాలయాన్ని శుక్రవారం తహసీల్దారు చొప్పా రవీంద్రబాబు, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు సందర్శించారు. అనంతరం బాలింతలకు, గర్భిణులకు బాలామృతం పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు- భూరక్షపై గ్రామసభ

సీతారామపురం : మండలంలో జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష కార్యక్రమంలో భాగంగా సర్వే పూర్తిఅయిన సింగారెడ్డిపల్లికి సంబం ధించి గ్రామసభను మండల తహసీల్దార్ ఎం వికే సుధాకర్‌రావు అధ్యక్షతన సింగారెడ్డిపల్లి సచివాలయంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

మర్రిపాడ : స్థానిక హైస్కూల్ ఆవరణలో శుక్రవారం సాహో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పడచల నాగేశ్వరావు పేద విద్యార్థులకు సంక్రాంతి కానుకగా బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ధనలక్ష్మి, శాంతి, మాజీ ఎంపీపీ రమణయ్య, మాజీ విద్యాశాకాధికారి సత్యనారాయణ, రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మర్రిపాడు : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన నందవరం చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగింది. నెల్లూరు నుండి కడప వైపు వెళ్తున్న కారు గేదెను ఢీకొనటంతో గేదె రోడ్డుకు అడ్డంగా పడింది. అదే సమయంలో ఆ గేదెను నెల్లూరు వెళ్తున్న మరో కారు ఢీకొని ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయణిస్తున్న ఇద్దరు, లారీ డ్రైవర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసునమోదు చేసి విచారిస్తున్నారు.

టీడీపీ నాయకులకు నోటీసుల జారీ


విలేఖరులతో మాట్లాడుతున్న డీఎస్పీ

ఉదయగిరి రూరల్, జనవరి 5: ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో తెలుగు దేశం పార్టీ నాయకులను అదుపులోకి తీసుకొని నోటీసులు జారీ చేసినట్లు కావలి డీఎస్పీ వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ గతనెల 29న ఉదయగిరి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణకు సంబంధించి ఉన్నెమొదల గురవయ్య తనపై దాడి చేసి కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేయడంతో మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి, ముజ్జే లక్ష్మీనారాయణ, జాఫర్‌సాహెబ్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఆ కేసుకు సంబంధించి వారిని అదుపులోకి తీసుకొని నోటీసులు జారీ చేశామన్నారు. కేసుపై విచారణ చేపడుతున్నామని, త్వరలో ఛార్జిషీట్ వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం పన్నులు వసూలు చేయాలి

ఉదయగిరి రూరల్, జనవరి 5: మండలంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు మార్చి 31వ తేదీలోపు నూరు శాతం పన్నులు వసూలు చేయాలని ఈవోపీఆర్డీ మల్లికార్జున శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటి పన్నులు చెల్లించేవారు ఫోన్‌పే, ఆన్‌లైన్, క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా నగదు చెల్లింపులు చేయాలన్నారు. మండలంలోని తిరుమలాపురం, ఆర్లపడియ, కృష్ణంపల్లి, శకునాలపల్లిలో రీసర్వే జరుగుతుందని, గృహాల యజమానులు సర్వే సిబ్బందికి సహకరించాలన్నారు.

బొల్లినేనిని విమర్శించడం తగదు


విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జనవరి 5: ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావును స్థాయి మరిచి వైసీపీ నాయకులు విమర్శించడం తగదని మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కండ్లగుంట వెంకటరెడ్డి, మాజీ జడ్పీటీసీ చీదర్ల మల్లికార్జున్‌లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వారు విలేఖరులతో మాట్లాడుతూ నియోజకవర్గానికి మూడు జాతీయ రహదారులను తీసుకొచ్చి అభివృద్ధి చేసిన ఘనత బొల్లినేనికే దక్కుతుందన్నారు. ఇకపై ఇలాంటి చౌకబారు విమర్శలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెపుతారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకర్ల మధు, ఏలూరి హనుమంతునాయుడు, కృష్ణారెడ్డి, రఘు, శ్రీనివాసులు, కొండారెడ్డి పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

అనంతసాగరం, జనవరి 5: ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని గూడూరు ఉప విద్యాధికారి రఘురామయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లి, ఉప్పలపాడు, మంచాలపల్లి, సోమశిల ఉన్నత పాఠశాలలను ఆయన తనిఖీ చేసి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి బాలకృష్ణారెడ్డి ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే చర్యలు


అభిరామ్ హస్పటల్‌లో స్కానింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా ప్రోగామ్ అధికారులు

ఆత్మకూరు, జనవరి 5 : స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని డిసీపీఎన్‌డిటి జిల్లా ప్రోగామ్ అధికారులు బి శ్రీనివాసరావు, కె కనకరత్నం తెలిపారు. శుక్రవారం వారు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాల, కెకెఆర్, అభిరామ్ హస్పటల్స్‌తో పాటు నిత్య డయాగ్నోస్టిక్స్ క్లియర్ స్కాన్ స్కానింగ్ సెంటర్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు స్కానింగ్ సెంటర్‌ల వద్ద ధరల పట్టిక, ప్రచార బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి నెలా గర్భిణులకు సంబంధించిన వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడలను విజయవంతం చేయండి

ఉదయగిరి రూరల్, జనవరి 5: మండల స్థాయిలో ఈనెల 10 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో జరిగిన క్రీడా పోటీల్లో విజేతలైన క్రీడాకారులు మండలస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

వరికుంటపాడు: ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడాదుస్తులను శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీదేవి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో షావుద్దీన్, పీఈటీలు, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షితలు


అంక్షితలు పంపిణీ చేస్తున్న రామసేవకులు

ఉదయగిరి రూరల్, జనవరి 5: ఉదయగిరి పట్టణంలో అయోధ్య రామ జన్మభూమి ట్రస్టు నుంచి వచ్చిన అక్షింతలు, కరపత్రాలను శుక్రవారం రామసేవకులు ఇంటింటా పంపిణీ చేశారు. ఈనెల 15వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో అక్షింతలు, కరపత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. విగ్రహ ప్రతిష్ఠ రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం సమయంలో దీపాలు వెలగించాలన్నారు.

వైద్యశిబిరం ప్రారంభం

వరికుంటపాడు, జనవరి 5: గణేశ్వరాపురం సచివాలయ ప్రాంగణంలో శుక్రవారం రెండో విడత సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ బాదం నారాయణరెడ్డి రోగులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చేవూరి. శ్రీదేవి, సర్పంచ్ వడ్లపల్లి తిరుపతయ్య, వైద్యులు షేక్ కరిష్మా, కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సమీర్, వార్డు సభ్యులు సింగమరెడ్డి. సుబ్బరాయుడు, సచివాలయ, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : మండలంలోని సింగారెడ్డిపల్లి సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష 2వ విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపిడిఓ భార్గవి, డాక్టర్ స్వప్న, వైసీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ బాలినేని మాబయ్య, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సచివాలయసిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

వింజమూరు: మండలంలోని ఊటుకూరు గ్రామంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గామ సర్పంచ్ రొడ్డ వెంగమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డ్వామా పీడీ వెంకట్రావు హాజరయ్యారు.

ఈవీఎంలపై అవగాహన

కావలి : ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్ కుమార్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఓటర్లకు, బీఎల్వోలకు అవగాహన కల్పించారు. ఈవీఎంలో దేనికి ఓటు నొక్కితే దానికి పడుతుందా లేదా, అవి ఎలా పనిచేస్తున్నాయనే దానిపై వివరించారు.

ప్రాచీన సంప్రదాయాలకు ముగ్గులు ప్రతీతి

● కావలి ఆర్డీవో శీనానాయక్ ● ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలకు విశేష స్పందన


మాట్లాడుతున్న ఆర్డీవో శీనా నాయక్


ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

కావలిటౌన్, జనవరి 5: ప్రాచీన సంప్రదాయ కళలకు ప్రతీతి ముగ్గులని కావలి ఆర్డీవో శీనానాయక్ పేర్కొన్నారు. "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్ణసీమ సుకేతన" సారథ్యంలో నెల్లూరులోని చందన బ్రదర్స్, సీఎంఆర్ షాపింగ్‌మాల్ ఆధ్వర్యంలో శుక్రవారం కావలి పట్టణం రైల్వే రోడ్డులోని కరోనేషన్ రీడింగ్ రూమ్ ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దడంతో కరోనేషన్ రీడింగ్ రూమ్ ప్రాంగణంలో సంక్రాంతి శోభ సంతరించుకుంది. సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ సందేశాలతో వేసిన రంగవల్లులు అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, శ్రీధర్ మల్టీ స్పెషలిటీ ఆసుపత్రి వైద్యురాలు కె.ఝాన్సీ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలు అంతరించిపోతున్న తరుణంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు నిర్వహించి మహిళలను ఒక వేదికపై చేర్చడం శుభపరిణామమన్నారు. మన సంస్కృతి సంప్రదాయలను కలకాలం కాపాడుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ సంస్కృతిని కొనసాగిస్తూ భావితరాలు అలవర్చుకునే విధంగా కృషి చేయాలన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని చాటేవే ముగ్గులని డాక్టర్ కే.ఝాన్సీ అన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన ఉపాధ్యాయిని, గాయకురాలు ఉమాశర్మ, సామాజిక కార్యకర్త పార్వతీశంకర్ ముగ్గుల విశిష్టత, ఔన్నత్యం గురించి వివరించారు.


ప్రోత్సాహక బహుమతి అందుకుంటున్న అనూష, పద్మ, నాగమణి

బొల్లినేనిని విమర్శించే స్థాయి కాటం రవీంద్రకు లేదు

కలిగిరి, జనవరి 5: అభివృద్ధి విషయంలో ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావును విమర్శించే స్థాయి వైసీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రరెడ్డికి లేదని మండల టీడీపీ, జనసేన అధ్యక్షులు బిజ్జం కృష్ణారెడ్డి, బండారు లక్ష్మీనారాయణ హితవు పలికారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ నాలుగేళ్లుగా అవినీతిలో మునిగిపోయి, పర్సెంటేజీలతో అక్రమార్జనలో మునిగిపోయిన కాటం రవీంద్రరెడ్డి మాజీ ఎమ్మెల్యే బొల్లినేనిని విమర్శించేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవడంతోపాటు, స్థాయిని తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊసా మాల్యాద్రి, పూసాల వెంగపనాయుడు, స్వర్ణ కొండయ్య, బొగ్గవరపు వేణు, నిశ్శంకర సురేష్, ఎం.శ్రీనివాస్, ఎల్.రాంబాబు, కొండపల్లి వెంకట్రావు, కె దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె


ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ కార్మికులు

కావలి, జనవరి 5: మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద వేర్వేరుగా శిబిరాలు ఏర్పాటు చేసుకుని సమ్మెను కొనసాగించారు. సీఐటీయూ అనుబంధ కార్మికులు 11 రోజులుగా, ఏఐటీయూసీ అనుబంధ కార్మికులు 3 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని కార్మిక సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ యూనియన్ నాయకులు మల్లె అంకయ్య, ఆదినారాయణ, వెంకటేష్, గుంజి కిషోర్, ఏఐటీయూసీ నాయకులు కొప్పర్తి నాగరాజు, వై.రాజేష్, ప్రభావతి, సీఐటీయూ అనుబంధ కార్మిక యూనియన్ నాయకులు తురక శీనయ్య, బిడదల మహేష్, క్రాంతి, బాబు, రమేష్, షానువాజ్, రాజేశ్వరి, అనిత, ఐసీటీయూ నాయకుడు వై.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.


సీఐటీయూ అనుబంధ కార్మికుల నిరసన

3వ రోజు మున్సిపల్ కార్మికుల దీక్షలు


నిరసనలో పారిశుధ్య కార్మికులు

కందుకూరు : కందుకూరులో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల దీక్షలు 3వ రోజు శుక్రవారం కూడా కొనసాగాయి. స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బి.సురేష్‌బాబు, వై.ఆనంద్‌మోహన్, పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు కె.రమణమ్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో జేసీ తనిఖీ


పౌష్టికాహారం కిట్టు అందచేస్తున్న జేసీ

బిట్రగుంట, జనవరి 5: బోగోలు రాజావీధిలోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అంగన్వాడీలు సమ్మె చేస్తుండటంతో రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో జరుగుతున్న పౌష్టికాహార పంపిణీని పరిశీలించారు. ఆయనవెంట తహసీల్దారు హేమంత్‌కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో కోటేశ్వరి, ఇన్‌చార్జి సూపర్‌వైజర్ సుప్రజా, గ్రామ మహిళ పోలీసు పుష్పలత, వీఆర్వో కిరణ్, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

'టీఆర్ఆర్' పూర్వ విద్యార్థికి సత్కారం

కందుకూరు: పోలీసు ఎస్ఐగా ఎన్నికైన టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల పూర్వవిద్యార్థి వలేటివారిపాలెం మండలం పోలినేనిపాలెంకు చెందిన ఎన్.ఏడుకొండలును కళాశాల ప్రిన్సిపాల్ కే.నాగేశ్వరరావు, అధ్యాపకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పీడీ టి.సుబ్బారావు, అధ్యాపకులు మస్తాన్‌వలి, వెంకటేశ్వరరావు, కాశీరత్నం, ఉష, బాబూరావు పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు తరలిన టీడీపీ శ్రేణులు


కనిగిరికి బయలుదేరిన ఇంటూరి, టీడీపీ శ్రేణులు

కందుకూరు, జనవరి 5: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు రా.. కదలిరా పేరుతో కనిగిరిలో నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభకు శుక్రవారం కందుకూరు నియోజకవర్గం నుంచి ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నుంచి, నియోజకవర్గంలోని మండలాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరేందుకు నిర్ణయించుకున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉన్నం నళినీదేవి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తూ మహానీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి తన అనుచరులతో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్, మాజీ ఎమ్మెల్యేలు పోతుల రామారావు, దివి శివరాంలు తమ అనుచరులతో కలిసి వేర్వేరుగా తరలివెళ్లారు.

దివ్యాంగులు, పేదలకు రగ్గుల పంపిణీ

బిట్రగుంట, జనవరి 5: బోగోలు మండలం కప్పరాళ్లతిప్ప పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం కావలి, బోగోలు పరిసర ప్రాంతాల్లోని దివ్యాంగులు, పేదలకు నెల్లూరుకు చెందిన ఎం.రాజేష్ జైన్ తన తండ్రి మన్‌మల్‌జైన్ జ్ఞాపకార్థం రగ్గులను పంపిణీ చేశారు. ప్రభుత్వ వైద్యుడు కే.చంద్రశేఖర్, హెచ్ఎం సీహెచ్.నాగరాజు, ఏఎస్సై సుధాకర్ రెడ్డి, దివ్యాంగుల నేత వెంకట్రావు, సీహెచ్.శ్రీనివాసులు, ఆయుష్ వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

పాతపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


బిట్రగుంట : పెన్షన్ అందచేస్తున్న బీద, రామిరెడ్డి

బిట్రగుంట, జనవరి 5: బోగోలు మండలం సీఆర్‌పాలెం పంచాయతీ పాతపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఏపీ ఆప్కాబ్ చైర్మన్ కొండూరు. అనిల్‌బాబులు పాల్గొన్నారు. లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేకల సుజాత, ఎంపీడీవో వెంకటసుబ్బారావు, మద్దిబోయిన కీర్తన, వైసీపీ నేతలు వీరరఘు, శ్రీనివాసులు, బీద.రమేష్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ

అల్లూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ, జడ్పీటీసీ వేణమ్మ, ఎంపీడీఓ జ్యోతి, తహసీల్దారు చంద్రశేఖర్, జిల్లా నాయకులు నీలం సాయికుమార్, గుమ్మడి సురేంద, తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరులో...


పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి

గుడ్లూరు : గుడ్లూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పులి రమేష్, డీఎల్‌డీవో పీ.పద్మజ, తహసీల్దారు సూర్యనారాయణ సింగ్, ఎంపీడీవో రాజశేఖర్, జడ్పీటీసీ బాపిరెడ్డి, సర్పంచు శంకర్ పాల్గొన్నారు.

రాములు కుటుంబానికి రూ.2 లక్షల చెక్కు అందజేత

బిట్రగుంట, జనవరి 5: రైల్వే కీమన్ ఎస్.రాములు నవంబరు 5వ తేదీ అల్లూరు రోడ్డు-బిట్రగుంట రైల్వే స్టేషన్ల మధ్య విధులు నిర్వహిస్తు ప్రమాద వశాత్తు మృతి చెందాడు. ఆయన కుటుంబానికి విజయవాడ డివిజనల్ మజ్దూర్ యూనియన్ కార్యదర్శి లీలా శుక్రవారం బిట్రగుంట పీడబ్ల్యూఐ కార్యాలయంలో యూనియన్ తరుపున రూ.2 లక్షల చెక్కు అందచేశారు. ఈ కార్యక్రమంలో బిట్రగుంట బ్రాంచ్ అధ్యక్షుడు యుఎస్.బాబు, కార్యదర్శి నవీన్, యూనియన్ సభ్యులు, రైల్వే కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు విశేష పూజలు


పసుపు, కుంకుమ పంపిణీ చేస్తున్న శివప్రియ

అల్లూరు, జనవరి 5 : అల్లూరులోని ముగ్గురమ్మల తిరునాళ్ల అనంతరం బీసీ కాలనీలో వెలసి ఉన్న పోలేరమ్మ చెట్టు వద్ద మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆయన సతీమణి శివప్రియ దంపతులు శుక్రవారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి చీర, పసుపు, కుంకుమలను ఉంచి పొంగళ్లు పొంగించి నైవేద్యంగా ఉంచారు. ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి సన్నిధిలో 300 మందికి పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అనంతరాజు బాలకృష్ణంరాజు, యరటపల్లి శేఖర్‌రెడ్డి, పప్పు సుధాకర్, స్థానికులు బ్రహ్మనాయుడు, రవీంద్ర, కోటి, ఫాజిల్, శ్రీరాములు పాల్గొన్నారు.

25వ రోజుకు అంగన్వాడీల సమ్మె


శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

కావలిటౌన్, జనవరి 5: సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు తలపెట్టిన సమ్మె శుక్రవారం 25 రోజులు పూర్తి చేసుకుంది. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదురుగా శిబిరంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్, సీపీఎం సీనియర్ నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రఘురావమ్మ, వజ్రమ్మ, పెంచలమ్మ, సుభాషిణి, విజయలత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ వికాస్ మర్మత్

సంప్రదాయానికి చిహ్నాలు ముగ్గులు

కమిషనర్ వికాస్

అలరించిన ముత్యాల ముగ్గుల పోటీ

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 5 : ముగ్గులు మన సంప్రదాయానికి చిహ్నాలని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ అన్నారు. పోటీలు ఏవైనా సరే ఆందాన్నిస్తాయని, మహిళలకు ముగ్గుల పోటీలంటే ఆనందంతోపాటు సంతృప్తినిస్తాయని తెలిపారు. శుక్రవారం నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కెనరా బ్యాంకు ముత్యాలముగ్గుల పోటీ, పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు బెంగుళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన సారథ్యంలో నెల్లూరులోని చందనా బ్రదర్స్ సీఎంఆర్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో జరిగాయి. బహుమతుల ప్రదానోత్సవానికి కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 20 ఏళ్లుగా ఏబీఎన్, ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీ నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. అలాగే ఇన్నేళ్లుగా పోటీలకు చందనా బ్రదర్స్, సీఎంఆర్ షాపింగ్ మాల్ సహకారం అందించడాన్ని ప్రశంసించారు. ఈ పోటీలకు ప్రధాన అతిథులుగా హాజరైన చందనా బ్రదర్స్ సీఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీ యాడ్స్ అధినేత మోహూరు పెంచలయ్య విజేతలకు అభినందనలు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి, పీ సుజాతరెడ్డి, ఏటూరి పద్మ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి, సీఎంఆర్ షాపింగ్ మాల్, చందనా బ్రదర్స్ సంస్కృతి సంప్రదా యాలకు విలువనివ్వడంతో పాటు భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా ముత్యాల ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నాయని కొనియాడారు. ఈ పోటీల్లో మహిళలు తమ సృజనాత్మకతతో రంగవల్లులు తీర్చిదిద్ది సంక్రాంతి శోభను ముందే తీసుకువచ్చారని అభినందినంచారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ హరికృష్ణ, ఎడిషన్ ఇన్‌చార్జి గోళ్ల రామకృష్ణ, బ్యూరో ఇన్‌చార్జి బీ నాగరాజు, ఏడీవీటీ ఇన్‌చార్జ్ అబ్దుల్ రహీం, సర్క్యులేషన్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, స్టాఫ్ రిపోర్టర్ అమరేంద్ర, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ మహేష్, ఆంధ్రజ్యోతి రిపోర్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కన్సోలేషన్ బహుమతుల విజేతలు



నాగ స్వప్న, శారద, బుజ్జమ్మ, విజయలక్ష్మి, ఉష



నెల్లూరు రూరల్ : సౌత్‌మోపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులతో కమిషనర్, చందన బ్రదర్స్ అధినేతలు, తదితరులు

లెప్రసీ సర్వే తనిఖీ

పొదలకూరు, జనవరి 5 : ఎల్‌సీడీసీ సర్వేలో భాగంగా పట్టణంలోని విఘ్నేశ్వరకాలనీలో వైద్య సిబ్బంది చేస్తున్న సర్వేను జిల్లా అదనపు వైద్యాధికారి (జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నివారణాధికారి) డాక్టర్ ఖాదర్‌వలి శుక్రవారం తనిఖీ చేశారు. కుష్టు వ్యాధిరహిత దేశంగా భారతదేశాన్ని నిలబెట్టాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రీకావ్య, డీపీఎంఓ మోహన్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీ సుమాంజలి, ఆరోగ్య సహాయకులు రాధాకుమారి, ఎస్.శివప్రసాద్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

యూరియా కుంభకోణంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

వెంకటాచలం : యూరియా కుంభకోణంపై ఉన్నతాధికారులు విజిలెన్స్ విచారణ చేయించాలని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ డిమాండ్ చేశారు. వెంకటాచలంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇలాకాలో యూరియా కుంభకోణం జరిగిందన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి జరిగిన అవినీతిని నిగ్గు తేల్చాలని, లేనిపక్షంలో వ్యవసాయ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి షేక్ సత్తార్ సాహెబ్, టీఎన్ఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు వెంకటాద్రి తదితరులున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించండి

వెంకటాచలం, జనవరి 5 : విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఏపీ ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి అధికారులకు సూచించారు. మండలంలోని చవటపాళెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న బాలుర గురుకుల పాఠశాలను ఆమె శుక్రవారం అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలోని అన్ని గదులతో పాటు వంటశాలలను పరిశీలించారు. ఆమె వెంట బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటయ్య, గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ దమ్ము కొండలరావు ఉన్నారు.

పొక్కందలలో వికసిత్ భారత్

సైదాపురం, జనవరి 5: మండలంలోని పొక్కందల గ్రామంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటగిరి నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చూడడం అధికారుల బాధ్యత అన్నారు. పథకాలపై అవగాహన కల్పించారు. కరపత్రాలు, క్యాలెండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం రాధ, మండల సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చేపల పెంపకం కోసం చెరువులకు వేలంపాట

సైదాపురం, జనవరి 5: సైదాపురం గ్రామ సచివాలయంలో శుక్రవారం పంచాయతీ పరిధిలోని చెరువులకు చేపల పెంపకం కోసం వేలంపాటలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మీసాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సైదాపురం చెరువుకు రూ.4.10లక్షలు, తిమ్మసముద్రం చెరువుకు రూ.1.10 లక్షలకు వేలంపాటలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద, ఉపసర్పంచు బొలిగర్ల శివకుమార్, సచివాలయ కార్యదర్శి శశి ఇంద్రాణి, రైతులు పాల్గొన్నారు.

అనంతమడుగులో జగనన్న ఆరోగ్య సురక్ష

సైదాపురం, జనవరి 5: మండలంలోని అనంతమడుగు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి, డాక్టర్ జనార్ధన్, మండల అధికారులు, సిబ్బంది, పీఏసీఎస్ అధ్యక్షుడు గోగినేని శివకుమార్, ఎంపీటీసీ వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ వెంకటకిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయికి సామూహిక కుంకుమార్చన

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 5: మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం కామాక్షితాయికి సామూహిక కుంకుమార్చన వైభవంగా జరిగింది. అనంతరం అమ్మవారిని పల్లకిలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ ఊరేగింపు చేశారు. ఉదయం గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 5: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని 4, 10, 13, 17 వార్డుల్లో నిర్మించిన సీసీ రోడ్లను శుక్రవారం కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం పలువురికి నూతన పింఛన్లు అందజేశారు. అనంతరం డీఎల్ఎన్ఆర్ హైస్కూల్లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే చంద్రబాబు ధ్యేయం : దినేష్‌రెడ్డి

కోవూరు, జనవరి 5: రాష్ట్రాభివృద్ధే టీడీపీ అధినేత చంద్ర బాబు నాయుడు లక్ష్యమని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కొత్తూరు ప్రాంతంలో శుక్రవారం ప్రతి అడుగు ప్రజల కోసమే, భవిష్యత్తుకు బాబు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడుతూ ఒక్క అవకాశం పేరుతో ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలను అవస్థలకు గురిచేస్తున్నారని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకా శాలు లేకపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్య మంత్రిగా చంద్రబాబు నాయుడుని ఎన్నుకుంటే సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నా రు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, బాలరవి, నాటకరాని వెంకట్, దారా విజయబాబు, అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, యాకసిరి వెంకటరమణమ్మ, మదన్‌రెడ్డి, ఉయ్యూరు వేణు, టవికుమార్, చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **ఇందుకూరు పేట, జనవరి 5 :** మండలంలోని కొరుటూరులో శుక్రవారం టీడీపీ మండల కన్వీనర్ రావెళ్ల వీరేంద్ర చౌదరి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పలువురు టీడీపీ నాయకులు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెముకుల కృష్ణచైతన్య, వరిగొండ సింధూర కృష్ణ, ఉదయగిరి పెంచలబాబు, మోటుపల్లి శ్రీహరి, కలిచేటి శీనయ్య, పెరుమాళ్ల వేణు, కోడూరు శ్రీనాథ్, షేక్.అజ్మత్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు

వెంకటాచలం, జనవరి 5 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వైఎస్ఆర్ పెన్షన్ కానుక రూ.3 వేలు పెంపు, నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీపీ మంద కవిత, సచివాలయాల మండల కన్వీనర్ మందల వెంకటశేషయ్య, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, నాయకులు వేమారెడ్డి రఘనందన్‌రెడ్డి, మోహన్‌నాయుడు తదితరులున్నారు.

ముత్తుకూరు: ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ పేదలకు రూ.3వేలు పింఛను అందజేసున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలి పారు. శుక్రవారం ముత్తుకూరు మత్స్య కళాశాలల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం శనివారం స్థానిక బస్టాండ్ సమీపంలో సామాజిక సాధికార బస్సుయాత్ర సదస్సు నిర్వహించే సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు ఈదూరు రామ్మోహన్‌రెడ్డి. మునుకూరు బాబిరెడ్డి, నెల్లూరు శివప్రసాద్, పోలిరెడ్డి చిన్నపరెడ్డి, కాకుటూరు లక్ష్మ ణరెడ్డి, అలపాక శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఆదరించండి : సినీనటుడు ఆలీ

రాపూరు(డక్కిలి), డిసెంబరు 5 : ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు మళ్లీ ఆదరించాలని వైసీపీ నాయకుడు, సినీనటుడు ఆలీ అన్నారు. శుక్రవారం రాపూరులో జరిగిన సాధికార సామాజిక సకల్ప యాత్ర బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి కుమారుడు రాంకుమారెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. సభలో కర్నూలు ఎమ్మెల్యే అఫీజ్, నెల్లూరు మేయర్ స్రవంతి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, తిరుపతి జిల్లా వైసీపీ అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నాగార్జునయాదవ్ తదితరులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలే వైసీపీకి శ్రీరామ రక్షగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ ఛైర్‌పర్సన్ దొంతు శారద, నాయకులు పాపకన్ను మధుసూదనరెడ్డి, నెల్లూరు రవీంద్రారెడ్డి, నారాయణరెడ్డి, చెలికం శంకరరెడ్డి, చింతల శ్రీనివాసులరెడ్డి, కల్లిరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, కార్తీక్ రెడ్డి, పాపకన్ను దయాకరరెడ్డి, నారసింహరెడ్డి, నక్కా వెంకటేశ్వరరావు, మాడా జానకిరామయ్య, చిట్టేటి మురికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జీవనియంత్రణ పద్ధతులతో తెగుళ్ల నివారణ

ముత్తుకూరు, జనవరి 5 : జీవ నియంత్రణ పద్ధతులతో వేరుశెనగ పంటలో తెగుళ్ల నివారణ సాధ్యమని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శివన్నారాయణ తెలిపారు. ముత్తుకూరులో శుక్రవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరి, వేరుశనగ సాగులో కలుపు యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీమాధవి, ఏవో గీతాకుమారి, కేవీకే శాస్త్రవేత్తలు విజయ్‌కుమార్, కిరణ్‌కుమార్, వ్యవసాయ అధికారి జ్యోత్స్నరాణి పాల్గొన్నారు.

రీసర్వేలో అభ్యంతరాలపై గ్రామసభలు

మనుబోలు, జనవరి 5: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో అభ్యంతరాలపై శుక్రవారం గ్రామసభలు నిర్వహించినట్లు తహసీల్దార్ బి శివకృష్ణయ్య తెలిపారు. మండలంలోని పర్లపాడు, అనుపల్లిపాడు రెవెన్యూ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ శనివారం ముద్దమూడి, వడ్లపూడి గ్రామాల్లో గ్రామసభలు ఉంటాయని, రైతులు ఎవరైనా సమస్యలు, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ శివప్రసాద్, విఆర్‌వో శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌జిల్లాల క్రికెట్ పోటీలకు పొదలకూరు విద్యార్థి ఎంపిక

పొదలకూరు, జనవరి 5 : పల్నాడు జిల్లా నరసరావుపేట డీఎస్‌ఏ స్టేడియంలో 8వ తేదీ వరకు జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లా క్రికెట్ పోటీలకు స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎంపికయ్యాడు. అండర్-17 విభాగం కింద పొదలకూరు డీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న మన్నవరపు వంశీకృష్ణ, జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో విజయం సాధించి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. వంశీకృష్ణ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె సనత్‌కుమార్ వంశీకృష్ణను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు సునీత, శివకుమార్ శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.



వంశీకృష్ణను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

లింగంపల్లిలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్

పొదలకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని లింగంపల్లి ఎస్సీ కాల నీలోని మండల ప్రజాపరిషత్ ప్రైమరీ స్కూల్‌లో స్పెషల్ క్యాంపు ప్రారంభించారు. ఇందులో భాగంగా పాఠశాల ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ, పొదలకూరు సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు గుంటి శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్‌డి.నాహీద్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సీనియర్ పెన్షనర్లకు సన్మానం

పొదలకూరు, జనవరి 5: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సమస్యలు, లైఫ్ సర్టిఫికెట్లు మంజూరు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సీనియర్ పెన్షనర్లు పి సోమానాయుడు, ఎస్ లక్ష్మీనారాయణ, షేక్ మస్తాన్‌సాహెబ్‌లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ గౌరవాధ్యక్షులు షేక్ మస్తాన్‌సాహెబ్, అధ్యక్షుడు కె కోటేశ్వరరావు, సెక్రటరీ కదిరి లక్ష్మీనారాయణ, జాయింట్ సెక్రటరీ జి నారాయణరెడ్డి, ట్రెజరర్ యు మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీటీఏ సభ్యత్వ నమోదు

పొదలకూరు, జనవరి 5 : మండలంలో నావూరు, అయ్యగారిపాలెం, అమ్మగారిపాలెం, తాటిపర్తి, తదితర పాఠశాలల్లో శుక్రవారం బీటీఏ రాష్ట్ర కార్యదర్శి ఊట్ల రఘు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ సెక్రటరీ టీవీ కృష్ణయ్య, ఓపీఎస్ సాధన కన్వీనర్ షేక్ ఖాజారహంతుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మల కృష్ణయ్య, పొదలకూరు మండల గౌరవ అధ్యక్షుడు షేక్ గౌస్‌బాషా, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హజరత్తయ్య, కలువాయి శీనయ్య, పొదలకూరు మండల సభ్యులు బ్రహ్మయ్య, మహేంద్రకుమార్, గంగాధర్, మోహన్‌మురళీ, వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి మెరుగైన వైద్యం అందించాలి

● మంత్రి కాకాణి... పలువురి పరామర్శ

నెల్లూరు (వైద్యం), జనవరి 5 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వైద్యులకు సూచించారు. నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్సీని శుక్రవారం ఆయన పరామర్శించారు. ప్రస్తుత పరిస్థితి, ఎప్పుడు కోలుకుంటారు వంటి విషయాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి, నెల్లూరు నగర మేయర్ పొట్లూరు స్రవంతి, జయవర్ధన్, టీడీపీ నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి తదితరులు కూడా చంద్రశేఖర్ రెడ్డిని పరామర్శించారు. విజయవాడలో ఉన్న కలెక్టర్ హరినారాయణన్ అపోలో ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి చంద్రశేఖర్‌రెడ్డికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్ మాట్లాడుతూ చంద్రశేఖర్‌రెడ్డికి బ్రెయిన్, చెస్ట్‌కు ఎలాంటి గాయాలు లేవని చెప్పారు. గురువారం అర్ధరాత్రి ప్రమాద స్థలి నుంచి చంద్రశేఖర్ రెడ్డిని అపోలో ఆసుపత్రికి తరలించిన కొరియోగ్రాఫర్ జానీమాస్టర్‌కు ఎమ్మెల్సీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఏపీజీఈ ఏఫ్ రాష్ట్ర ఛైర్మన్ కాకార్ల వెంకట్రామిరెడ్డి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవపాల్, నెల్లూరు జిల్లా ఛైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు తదితరులు కూడా ఎమ్మెల్సీని పరామర్శించారు.



చంద్రశేఖర్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి కాకాణి

భగత్‌సింగ్ కాలనీని అభివృద్ధి చేసింది నేనే

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 5: వెంకటేశ్వరపురంలోని భగత్‌సింగ్ కాలనీని అభివృద్ధి చేసింది తానే అని మాజీ మంత్రి, టీడీపీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పొంగూరు నారాయణ తెలిపారు. భగత్‌సింగ్ కాలనీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. నారాయణ ప్రతి ఇంటికి వెళ్లి టీడీపీ చేసిన అభివృద్ధిని, వైసీపీ చేస్తున్న అరా చకాలను వివరించారు. ఒక్క చాన్స్ అంటే వైసీపీకి ఓటు వేసి మోసపోయామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డివిజన్ ఇన్‌చార్జి జహీర్, అధ్యక్షుడు సాజిద్, జనరల్ సెక్రటరీ ఇబ్రహీం, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వృద్ధురాలికి అభివాదం చేస్తున్న నారాయణ

కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

నెల్లూరు (వైద్యం), జనవరి 5 : కాంగ్రెస్ పార్టీలోకి శుక్రవారం భారీగా చేరికలు జరిగాయి. నగరంలోని ఇందిరాభవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి సమక్షంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి చెందిన సిరివెళ్ల నరేష్ అతని అనుచరులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చేవూరు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. వైఎస్ఆర్ కుమార్తె షర్మిల పార్టీలోకి రావడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీవీ శేషారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్, నగర అధ్యక్షుడు షేక్ ఫయాజ్, స్వర్ణ రాజశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్, సాయి ప్రకాష్ పాల్గొన్నారు.



నరేష్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న చేవూరు

రూరల్ సీఐగా సుబ్బారావు బాధ్యతల స్వీకరణ

నెల్లూరు రూరల్, జనవరి 5 : నెల్లూరు రూరల్ మండల సీఐగా వీ సుబ్బారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గుడ్లూరు సీఐగా పని చేస్తున్న ఆయనను ఇటీవల నెల్లూరు రూరల్‌కు బదిలీ చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సౌరశక్తి వినియోగంతో పర్యావరణ పరిరక్షణ

● డాక్టర్ చేతన్ సింగ్ సోలంకీ

నెల్లూరు (విద్య), జనవరి 5 : సౌరశక్తి వినియోగం పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తుందని ఐఐటీ ముంబై ప్రొఫెసర్, ఎనర్జీ స్వరాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సోలార్ మ్యాన్ ఆఫ్ ఇండియా డాక్టర్ చేతన్ సింగ్ సోలంకి తెలిపారు. నెల్లూరులోని రెయిన్‌బో సీబీఎస్ఈ పాఠశాలలో శుక్రవారం జరిగిన ఎంపవరింగ్ ఇండియా కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. దేశంలో విద్యుత్ ఉత్పత్తికి డిమాండ్ అధికమవుతున్న తరుణంలో దీని ప్రభావం పర్యావరణంపై పడుతుందన్నారు. పునరుత్పాదక శక్తి అందుబాటులో ఉన్నా ప్రజలు దానిని ఉపయోగించుకునేందుకు ఆసక్తి చూపించకపోగా శిలాజ ఇంధనాలు ఉపయో గించడం వల్ల భూతాపం రోజురోజుకూ పెరిగిపోతోందని చెప్పారు. ఫలితంగా ప్రకృతి వైపరీత్యాలు, ఇతర ఉపద్రవాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీనికి పరిష్కారంగా పునరుత్పాదక శక్తిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తాను ఎనర్జీ స్వరాజ్ యాత్ర పేరుతో దేశవ్యాప్తం గా యాత్ర చేపడుతున్నానని చెప్పారు. ఇందు కోసం 6 కిలో వాట్ల బ్యాటరీ సామర్థ్యం ఉన్న బస్సును సిద్ధం చేసుకుని అందులోనే ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు ఏఎంజీ ఫార్ములా గురించి తెలియచేయడంతోపాటు బస్సులోని వసతులను చూపించి వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం, ఈడీ యాని గోపకుమార్, ప్రిన్సిపాల్ అరుణ స్వయంప్రభ తదితరులు పాల్గొన్నారు.



సోలార్ ఎనర్జీ బస్సు వద్ద విద్యార్థులు

ప్రజలకు సమస్యలు రానివ్వొద్దు

● నగర కమిషనర్

నెల్లూరు(సిటీ), జనవరి 5 : పారిశుధ్య కార్మికుల సమ్మె దృష్ట్యా ప్రజలకు సమస్యలు రానివ్వకుండా చెత్త తరలింపును నిర్వహించాలని కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నెల్లూరులోని వైఎంసీఏ మైదానంలో డంప్‌చేసిన చెత్తను దొంతాలి డంపింగ్ యార్డుకు వేగంగా తరలించాలని సూచించారు. డివిజన్లలో చెత్త సేకరణను ప్రైవేట్ కార్మికులతో నిర్వహించాలన్నారు. అంతకుముందు కార్యాలయంలో ఎన్నికల అధికారులతో సమీక్షించారు.

మదరసాకు జానీ మాస్టర్ సాయం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 5: నగరంలో పొదలకూరురోడ్డు ప్రగతి నగర్‌లోని మదరసా ఈ మనర్వా సంస్థకు ప్రముఖ నృత్య దర్శకుడు జానీ మాస్టర్ శుక్రవారం రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆ మదరసాకు 2019 నుంచి ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందలేదని, జగన్ ప్రభుత్వంలో ముస్లింలకు అందాల్సిన ఏ ఆర్థిక సహాయం అందడంలేదని ఆరోపించారు. సదరు మదరసా నిర్వహణకు ప్రతి నెల రూ.10 వేలు సంవత్సరం రోజులు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రాసలీలలపై విచారణ

నెల్లూరు (వైద్యం), జనవరి 5 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సిబ్బంది రాసలీలలపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ శుక్రవారం వివరణ ఇచ్చారు. ఎంఎస్‌వోతో పారిశుధ్య కార్మికురాలి రాసలీల విషయం తెలియగానే శానిటేషన్ ఏజెన్సీ పారిశుధ్య కార్మికురాలిని విధుల నుంచి తొలగించిందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్‌వోతోపాటు, ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ విభాగం కూడా ఓ రిపోర్టు ఇచ్చిందని, పూర్తిస్థాయి విచారణకు కమిటీ వేశామని ఆ కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలియచేశారు.

న్యాయవాదులకు కేన్సర్ అవగాహన శిబిరం

నెల్లూరు (లీగల్), జనవరి 5 : నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్వర్యంలో శుక్రవారం మెడికవర్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు న్యాయవాదులకు కేన్సర్ వ్యాధి అవగాహన శిబిరం నిర్వహించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ ఉమామహేశ్వర్ రెడ్డి, పీ సుందరయ్య యాదవ్, సర్జికల్ అంకాలజిస్ట్ రమేష్‌బాబు, డాక్టర్ బిందు రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ వివరాల మేరకే నిల్వలుండాలి

● అగ్రి ఏడీ రామిరెడ్డి

నెల్లూరు రూరల్, జనవరి 5 : ఎరువుల దుకాణాల్లో ఆన్‌లైన్ వివరాల మేరకే భౌతిక నిల్వలుండాలని, అందుకు భిన్నంగా నిల్వలు కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వింజమూరు వ్యవసాయ శాఖ ఏడీ రామిరెడ్డి వ్యాపారులను హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని వెల్లంటి గ్రామంలో అంతర్గత తనిఖీల్లో భాగంగా ఏవో ఎస్వీ నాగమోహన్‌తో కలిసి ఆయన రికార్డులను పరిశీలించారు. ఈ-పోస్ యంత్రాల్లో చూపించే ఆన్‌లైన్ వివరాలు ఎంతున్నాయో అంతమేరకే భౌతిక నిల్వలుండాలని స్పష్టం చేశారు. ఎరువుల బస్తాలపై ఉండే ఎంఆర్పీకి మాత్రమే అమ్మకాలు జరపాలని సూచించారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను బట్టి షాపుల లైసెన్సులు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మత్స్య సంపద దోపిడీపై విచారణ జరపండి

నెల్లూరు రూరల్, జనవరి 5 : గ్రామ పంచాయతీల్లో చేపల చెరువుల్లోని మత్స్య సంపద దోపిడీపై విచారణ జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని డీపీవో సుస్మితారెడ్డి నెల్లూరు రూరల్ మండల అధికారులను ఆదేశించినట్లు సమాచారం. మండలంలోని కొత్త వెల్లంటి, పాత వెల్లంటి, గొల్లకందుకూరులో చేపల చెరువులను వేలంలో దక్కించుకున్న వారు పంచాయతీలకు చెల్లించాల్సిన నగదు చెల్లించకుండా దారి మళ్లించడంపై 'చేపలను మింగుతున్న తిమింగలాలు' శీర్షికతో ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి ఆమె స్పందించారు. ఆ మూడు పంచాయతీల్లో చేపల నగదు చెల్లింపులపై సమగ్ర విచారణతో తనకు నివేదిక అందచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం	9985411424
నెల్లూరు ఏసీవో	9542727676
నెల్లూరు సిటీ	8179815202
నెల్లూరు రూరల్	8885688410
కోవూరు	8008894200




● కావలిలో..



ఇలపై రంగులు పోసినట్టు.. ప్రతి చుక్కా ముగ్గు కోసమే అన్నట్టు తెలుగు సంప్రదాయం ఒట్టిపడేలా నారీమణులు వేసిన రంగవల్లులు అందరినీ కట్టిపడేశాయి.

సంక్రాంతి పండుగ ముందే వచ్చిందా!? అన్నరీతిలో వేసిన ముగ్గులు ముచ్చట గొలిపాయి. ఏబీఎన్, ఆంధ్రజ్యోతి నిర్వహించిన కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు బెంగుళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన్ సారథ్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నెల్లూరులోని చందనా బ్రదర్స్, సీఎంఆర్ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో శుక్రవారం ముత్యాల ముగ్గులు ఉత్సాహభరితంగా జరిగాయి. నెల్లూరు, కావలి, గూడూరు ప్రాంతాల్లో నారీమణులు భారీగా తరలివచ్చి వారిలోని సృజనాత్మకతను వెలికితీసి ముగ్గులు వేశారు. ప్రతి కేంద్రంలో ప్రథమ విజేతలకు పట్టు చీర, ద్వితీయ విజేతకు వర్కు శారీ, తృతీయ విజేతకు డిజైనర్ శారీలతోపాటు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. అలాగే పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు.

మంత్ర ముగ్ధులై..!

ఉత్సాహంగా 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' రంగవల్లుల పోటీలు ● నెల్లూరు, కావలి, గూడూరులలో నిర్వహణ

● విజేతలు వీరే..


నెల్లూరు : ప్రథమ విజేత సునీతకు బహుమతి అందజేస్తున్న కమిషనర్ వికాస్ మర్మత్, వాసు, పెంచలయ్య తదితరులు

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో జరిగిన రంగవల్లుల పోటీలకు మహిళలతోపాటు విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలు బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి, పి.సుజాత రెడ్డి, ఏటూరి పద్మ ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, చందనా బ్రదర్స్, సీఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ హరికృష్ణ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు.

● కావలి : పట్టణంలోని రైల్వే రోడ్డులో ఉన్న కరోనేషన్ రీడింగ్ రూమ్ ఆవరణలో జరిగిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. పోటాపోటీగా వేసిన ముగ్గులలో విజేతలను నిర్ణయించేందుకు న్యాయనిర్ణేతలు ఎంతో శ్రమించి వారి మెదడుకు పదునుపెట్టాల్సి వచ్చింది. చివరకు ఉపాధ్యాయిని, గాయకురాలు ఉమాశర్మ, సామాజిక కార్యకర్త పార్వతీశంకర్‌లు విజేతలను ఎంపిక చేశారు. ముఖ్య అతిథులుగా ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, శ్రీధర్ మల్టీ స్పెషలిటీ హాస్పిటల్ వైద్యురాలు ఝాన్సీ పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.


కావలి : ఆర్డీవో శీనానాయక్, కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ల నుంచి మొదటి బహుమతి అందుకుంటున్న విద్యాధరణి



2, 3వ విజేతలు జయ, అఖిల ఆదిశేషమ్మ

● గూడూరు : పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల మైదానంలో జరిగిన పోటీలకు మహిళలు తరలివచ్చి ఉత్సాహంగా ముగ్గులు వేశారు. న్యాయనిర్ణేతలుగా సునీత సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, సభ్యురాళ్లు మహిత, గ్రీష్మ పురోహిత్ వ్యవహరించి, విజేతలను ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పనుల ఒత్తిడిలో మహిళలు సతమతమవుతున్న తరుణంలో వారిలో ఉత్సాహాన్ని, సంప్రదాయ విలువలను, కళాత్మకతను వెలుగులోకి తెచ్చేందుకు ఆంధ్రజ్యోతి -ఏబీఎన్ ఈ పోటీలను నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.


నెల్లూరు : ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు, న్యాయనిర్ణేతలు



గూడూరు : డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి నుంచి మొదటి బహుమతి అందుకుంటున్న ఝాన్సీరాణి



కావలిలో ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకుంటున్న వరలక్ష్మి, శ్రీదేవి


గూడూరులో ముగ్గులు వేస్తున్న మహిళలు


ద్వితీయ విజేత ఎన్.సుశ్మిత


తృతీయ విజేత ఆర్.యమున

'స్వచ్ఛ' అవార్డుల్లో తిరుపతికి చోటు

తిరుపతి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ సర్వేక్షణ్-2023 జాతీయస్థాయి పురస్కారాల్లో తిరుపతి కార్పొరేషన్‌కు చోటు దక్కింది. కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన పారిశుధ్య సర్వేలో దేశంలోనే ఉత్తమ నగరాలుగా గ్రేటర్ విశాఖ, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగరపాలక సంస్థలు నిలిచాయి. జాతీయస్థాయి అవార్డు రావడం పట్ల కమిషనర్ హరిత హర్షం వ్యక్తం చేశారు.

లారీని ఢీకొన్న బస్సు

ఇద్దరు డ్రైవర్ల దుర్మరణం ● నలుగురికి గాయాలు


క్రేన్ సాయంతో లారీ డ్రైవరును బయటకు తీస్తున్న స్థానికులు


దినేష్ ప్రతాప్ సింగ్ మృతదేహం

పెళ్లకూరు, జనవరి 5: లారీని ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు డ్రైవర్లు మృతి చెందగా మరో నలుగురికి గాయాలయ్యాయి.పెళ్లకూరు మండలం లోని కొత్తూరు వద్ద 71వ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం 5.30 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు... గురువారం మధ్యాహ్నం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జగదల్‌పూర్ నుంచి ఓ ట్రావెల్స్ బస్సులో 20మంది విహారయాత్రకు బయలుదేరారు. శుక్రవారం ఉదయం కొత్తూరు వద్ద అదుపుతప్పిన బస్సు తమిళనాడు రాష్ట్రం వేలూరు నుంచి నెల్లూరుకు కంకర లోడ్డుతో వెళ్తున్న లారీని ఎదురుగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ముంబాయికి చెందిన బస్సు డ్రైవర్ దినేష్ ప్రతాప్ సింగ్ (48) అక్కడికక్కడే మృతి చెందాడు. తమిళనాడులోని విల్లిపురానికి చెందిన లారీ డ్రైవర్ ఇలగవరన్ (55) లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు రెండు క్రేన్ల ద్వారా అతికష్టమ్మీద బస్సును లారీని విడదీసి డ్రైవర్‌ను బయటకు తీశారు. తీవ్ర గాయాలతో క్యాబిన్‌లో డ్రైవర్ గంటన్నరకు పైగా నరకయాతన అనుభవించిన ఇలగవరన్ నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాలకు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పజెప్పనున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.బస్సులో నలుగురు గాయపడగా నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్సలందించారు.


ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చంద్రబాబు సభను విజయవంతం చేయండి



సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వెంకటగిరి, జనవరి 5: టీడీఈపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 9వ తేదీన వెంకటగిరిలో 'రా... కదలిరా...' పేరిట నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలోని పార్టీ కార్యాలయంలో వెంకటగిరి, డక్కిలి మండలాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి జన సమీకరణపై చర్చించారు. అనంతరం తిరుపతి - వెంకటగిరి రోడ్డు మార్గంలో సభ నిర్వహించే ప్రాంతాన్ని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి కురుగొండ్ల పరిశీలించారు. జనసేన నాయకులు తోటా కృష్ణయ్య, టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పునుగోటి విశ్వనాథ నాయుడు, శ్రీరామదాసు గంగాధర్, బీరం రాజేశ్వరావు, చెంచయ్య, రమేష్ నాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, జన్ని రమణయ్య, అవ్వారు సత్యనారాయణ, ఏలేశ్వరం రామచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభను జయప్రదం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

గూడూరు, జనవరి 5: వెంకటగిరిలో ఈనెల 9వ తేదీన జరగనున్న చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరగనున్న బహిరంగసభను జయప్రదం చేద్దామని గూడూరు నియోజకవర్గ పరిశీలకుడు పెళ్లకూరు శ్రీనివాసులరెడ్డి, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9వ తేదీన వెంకటగిరిలో జరగనున్న బహిరంగసభకు నియోజవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనతో విసిగిపోయిన ప్రజలు సైకో ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేకవిధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలుపించుకుని రాష్ట్రాభివృద్ధిని కాంక్షించే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిగా గెలుపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీమ్, రవీంద్రరెడ్డి, గుండాల లీలావతి, ఇశ్రాయేల్‌కుమార్, శివకుమార్, నరసింహులు, అమరేంద్ర, శ్రీదేవి పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రప్ప

గూడూరు, జనవరి 5: బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప అన్నారు. శుక్రవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం తనవిగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే విధంగా నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా కృషి చేయాలన్నారు. పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, పనబాక కోటేశ్వరరావు, మోహన్, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, బిందురెడ్డి, మనోజ్‌కుమార్, శ్రీనివాసరావు, సాయిలక్ష్మణ్, చెంచురెడ్డి, గాలి ప్రకాష్‌నాయుడు, సంజీవనాయుడు, వేణుగోపాల్‌రెడ్డి, నరేంద్రపాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి



రామాపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జనవరి 5: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీని గెలిపించి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీ రామాపురంలో శుక్రవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ అరాచకాలతో రాష్ట్రం దివాళా తీసిందని, ప్రతి ఒక్కరూ మేలుకొని సైకో జగన్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వేణు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రగా కొలితోటకు



గోవింద మాలతో పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

వెంకటగిరిటౌన్, జనవరి 5: వెలుగొండ అడవుల్లోని కొలితోటలో వెలసిన లక్ష్మీనరసింహ సమేత చెంచమ్మకు మొక్కులు చెల్లించేందుకు 370 మంది భక్తులు గోవింద మాలతో పాదయాత్రగా శుక్రవారం వెళ్లారు. ఈ సందర్భంగా నరసింహ స్వామి, చెంచమ్మను గరుడ వాహనంపై ఊరేగించారు. అనంతరం ఈవో శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఏటా కాశీ విశ్వనాథ స్వామి ఆలయం నుంచి భక్తులు ఇరుముడి కట్టుకుని కొలితోటకు పాదయాత్ర వెళ్లి చెంచమ్మకు మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు.

నేత్రదానం

సూళ్లూరుపేట, జనవరి 5: మండల పరిధిలోని దావాదిగుంట గ్రామానికి చెందిన శ్రీహరికోట వేమమ్మ(88) గురువారం రాత్రి మృతి చెందింది. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు చెన్నైలోని శంకర నేత్రాలయ ఆస్పత్రికి దానం చేశారు. కార్యక్రమంలో ఆచార్య భరద్వాజా సేవాసంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఆలపాటి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నా వార్డులో ఒక్క పనీ జరగలేదు

వైసీపీ కౌన్సిలర్ ఆగ్రహం



పనులు జరగలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్ షబ్బీర్

నాయుడుపేట టౌన్, జనవరి 5: నా వార్డులో ఇప్పటి వరకు ఒక్క అభివృద్ధి పనీ జరగలేదంటూ 14వ వార్డు కౌన్సిలర్ షబ్బీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్ పర్సన్ కటకం దీపిక అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. మొదటగా కమిషనర్ శ్రీనివాసరావు వార్డుల వారీగా జరిగిన అభివృద్ధి పనులను వెల్లడించారు. దీనిపై 14వ వార్డు కౌన్సిలర్ షబ్బీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు తన వార్డులో ఎలాంటి అభివృద్ధి పనీ జరగలేదని, పనులు చేపట్టేందుకు ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకురావడం లేదన్నారు. ఎటువంటి అభివృద్ధి పనులు చేయనందు వల్ల వార్డులోకి వెళ్లలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ స్పందిస్తూ తక్షణమే పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతామని చెప్పారు.

ఎన్నికల విధులపై శిక్షణ

గూడూరు, జనవరి 5: స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీహాలులో శుక్రవారం గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల పరిధిలోని ఎన్నికల సెక్టారు అధికారులకు ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చారు. రిటర్నింగ్ అధికారి కోదండరామ్ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో సెక్టారు అధికారులు అప్రమతంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, చంద్రముని తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి - మొదటి మూడు బహుమతులు అందుకున్న యమున, ఝాన్సీరాణి, సుశ్మిత

ముగ్గులు మహిళల్లో కళకు ప్రతిరూపం

ఆకట్టుకున్న ఏబీఎన్- ఆంధ్రజ్యోతి రంగవల్లుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు సులక్ష్మి, మహిత, గ్రీష్మపురోహిత్

గూడూరు, జనవరి 5: ముగ్గులు మహిళల్లోని కళకు ప్రతిరూపమని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. గూడూరు పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన సారథ్యంలో నెల్లూరులోని చందన బ్రదర్స్ సీఎంఆర్ షాపింగ్‌మాల్ నిర్వహించిన రంగవల్లుల పోటీలు కనువిందు చేశాయి. 45మంది మహిళలు రెండు గంటల పాటు శ్రమించి రంగురంగులతో ముగ్గులను తీర్చిదిద్దారు. గూడూరు పట్టణంలోని వీరారెడ్డిపల్లికి చెందిన ఏ.ఝాన్సీరాణి ప్రథమ బహుమతి, మండలంలోని నెల్లటూరుకు చెందిన ఎన్.సుశ్మిత ద్వితీయ బహుమతి, పట్టణంలోని నరశింగరావుపేటకు చెందిన ఆర్.యమున తృతీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలకు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వీరితో పాటు మరో ముగ్గురు మహిళలకు కన్సోలేషన్ బహుమతులుగా చీరలు, పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను అందించారు. న్యాయనిర్ణేతలుగా సునీతసేవా సంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి, సభ్యులు మహిత, గ్రీష్మపురోహిత్ వ్యవహరించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి గడిచిన 15 సంవత్సరాలుగా ఏటా సంక్రాంతి పండుగకు ముందు ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి పోటీలు మహిళల్లో పనిఒత్తిడి తగ్గించి ఉత్సాహాన్ని, ఆనందాన్ని నింపుతాయన్నారు. న్యాయనిర్ణేత సారంగం సులక్ష్మి మాట్లాడుతూ పాతరోజుల్లో ఇంటి ముంగిట బియ్యం పిండితో ముగ్గులు వేయడం అలవాటుగా ఉండేదన్నారు. ఆ పిండి చీమలకు, పక్షులకు ఆహారంగా ఉండేదని గుర్తుచేశారు. అపార్టుమెంట్ల సంస్కృతి పెరగడంతో ముగ్గులకు ఆదరణ తగ్గిందని, ఇలాంటి సమయాల్లో మహిళలను రంగవల్లుల వైపు మళ్లించేందుకు ఆంధ్రజ్యోతి చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





వెంకటగిరి వీధుల్లో సాగుతున్న బస్సుయాత్ర - రోడ్డుపై బైఠాయించిన అంగన్వాడీలు

వెలవెలబోయిన వైసీపీ బస్సు యాత్ర

భోజనానంతరం జారుకున్న జనం

వెంకటగిరి టౌన్/డక్కిలి, డిసెంబరు, 5: వైసీపీ సామాజిక సాధికార సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం వెంకటగిరి నుంచీ రాపూరు వరకూ చేపట్టిన బస్సు యాత్ర పాక్షికంగానే సఫలమైంది. యాత్రలో భాగంగా జరిగిన రోడ్‌షోకు మధ్యాహ్నం వరకూ జనం మోస్తరుగా కనిపించినా భోజనాల తర్వాత జారుకున్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఎక్కడా జరగని రీతిలో భారీ ఎత్తున బస్సుయాత్రను విజయవంతం చేయాలని కసరత్తు చేశారు. వారం రోజులపాటు నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశాలు జరిపారు. గురువారం రాత్రికి జనం వచ్చే పరిస్థితి లేదని గ్రహించి ఒక్కో వలంటీరు యాభై మందిని చొప్పున బస్సు యాత్రకు తీసుకురావాలని ఆదేశించారు. బస్సుయాత్రలో సినీ నటుడు అలీ పాల్గొనడంతో అతన్ని చూసేందుకు మధ్యాహ్నం వరకూ జనం బస్సు యాత్ర వెంట బాగానే కనిపించారు. మధ్యాహ్నం భోజనాలు పెట్టాక మాత్రం ఎవరి దారిన వారు జారుకున్నారు. దీంతో తర్వాత జరిగిన బస్సు యాత్రలో జనం పలచగా కనిపించారు. కాగా వెంకటగిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌ను బస్సు యాత్రకు ఆహ్వానించలేదని ప్రచారమైంది. ఆమె యాత్రలో కనిపించకపోవడంతో బీసీ మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అన్న విమర్శలు వినిపించాయి. అలాగే బస్సు యాత్ర సందర్భంగా పోలీసుల అత్యుత్సాహంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యాత్రలో రామ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ తాను నియోజకవర్గ ఇంఛార్జిగా నియమితుడినయ్యాక స్వల్ప వ్యవధిలోనే ఎక్కువ అభివృద్ధి చేశానన్నారు. రాబోయే ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. మార్గమధ్యంలోని డక్కిలి మండల కేంద్రంలో కమ్మపల్లి రోడ్డు సెంటరు వద్ద ముఖ్య అతిధిగా పాల్గొన్న సినీ నటుడు అలీ మాట్లాడుతూ హలో... నా పేరు అలీ అంటూ ప్రజలకు పరిచయం చేసుకున్నారు. ప్రజలు సామాన్యులు కాదని, నాయకులను ఎంతో ఆదరిస్తారని, అభివృద్ధి చేయకపోతే తోకలు కత్తిరిస్తారన్నారు.ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్‌రావు, నెల్లూరు మేయర్ స్రవంతి తదితరులు మాట్లాడగా తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీలు సునీత, సిపాయి సుబ్రమణ్యం, జిల్లా గ్రంధాలయ అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ శారద, దేవాంగ కార్పోరేషన్ చైర్మన్ సురేంద్ర, స్థానిక నేతలు చింతల శ్రీనివాసులు రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, కాల్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, చెలికం శంకరరెడ్డి, దశరథరామిరెడ్డి, నర్రావుల ప్రకాశం నాయుడు, కోళ్లపూడి వేణుగోపాల్, కార్తీకరెడ్డి, నక్కా వెంకటేశ్వర్లు, మాడా జానకిరాం, ఎల్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.కాగా డక్కిలిలో బస్సుయాత్రకు వచ్చిన జనానికి మద్యం సరఫరా చేశారు. బస్సుయాత్ర డక్కిలిలోకి ప్రవేశించక ముందే జనం మద్యం బాటిళ్లు పట్టుకుని కనిపించారు.

రోడ్డుపై బైఠాయించిన అంగన్వాడీలు

వైసీపీ బస్సు యాత్రను అంగన్వాడీ కార్యకర్తలు అడ్డుకున్నారు. బస్సు దగ్గరకు పోనివ్వకుండా పోలీసులు అడ్డుపడడంతో అక్కడే రోడ్డుపై బైఠాయించి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో తిరుపతి ఎంపీ గురుమూర్తి బస్సు దిగి వారి నుంచీ వినతిపత్రం స్వీకరించారు. అంగన్వాడీల ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని, పైగా సమస్య వినాలని శాంతియుతంగా కోరిన మహిళలను పోలీసుల ద్వారా నెట్టించడం దారుణమంటూ సీఐటీయూ నేత చెంగయ్య మండిపడ్డారు.

సిలికా, ఇసుక లారీల అడ్డగింత



వాహనాలను అడ్డుకుని నిరసన తెలుపుతున్న కలవకొండ గ్రామస్తులు

చిల్లకూరు, జనవరి 5: మండలంలోని కలవకొండ గ్రామస్తులు శుక్రవారం సిలికా, ఇసుక లారీలను అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిలికా, ఇసుక లోడుతో వెళుతున్న లారీలు, టిప్పర్లు తమ గ్రామంలో వేగంగా వెళుతున్నాయన్నారు. దీని వల్ల రోడ్డు మీద దుమ్ము ఇళ్లలోకి చేరుతోందన్నారు. అంతేకాకుండా లారీలు, టిప్పర్ల వెనుక వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిలికా, ఇసుక వాహనాల వేగాన్ని నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడండి



చైర్ పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కందల కృష్ణారెడ్డి

నాయుడుపేట టౌన్, జనవరి 5: పట్టణంలో ప్రభుత్వ స్థలాలను కాపాడాలని కోరుతూ చైర్ పర్సన్ కటకం దీపికకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో విలువైన స్థలం అన్యాక్రాంతమైనా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. సర్వే చేసి స్థలాలను పరిరక్షించాలని కోరారు.

సంచారజాతులకు న్యాయం చేయండి



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నక్కలోళ్లు

నాయుడుపేట టౌన్, జనవరి 5: తమకు న్యాయం చేయాలంటూ మున్సిపల్ కార్యాలయం ఎదుట సంచారజాతులు(నక్కలోళ్లు) నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజుల క్రితం పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ఉన్న తమను ఉన్న ఫలంగా ఖాళీ చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. చిరువ్యాపారాలు చేసుకుంటున్న తమకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా రోడ్డున పడేశారని వాపోయారు. సంచారజాతుల(నక్కలోళ్ల)కు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి, సీఐటీయూ నాయకులు చాపల వెంకటేశ్వర్లు, శివకవి ముకుంద మద్దతు పలికారు.

సమావేశానికి హాజరుకండి

పెళ్లకూరు, జనవరి 5: నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో శనివారం మధ్యాహ్నం 3:30 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య కోరారు. ఈ నెల 9న వెంకటగిరిలో నిర్వహించే రా.. కదలిరా సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పాల్గొంటారని, ఈ సభను విజయవంతం చేయడంపై చర్చించనున్నట్లు చెప్పారు.





చెంగాళమ్మ ఆలయానికి ర్యాలీగా వెళ్తున్న అంగన్వాడీలు - గూడూరులో గొబ్బిళ్లు ఆడుతూ నిరసన

చెంగాళమ్మా... సీఎం మనసు మార్చు తల్లీ

అమ్మవారికి అంగన్వాడీల మొక్కులు

సూళ్లూరుపేట, జనవరి 5: తమ సమస్యల పరిష్కారం కోసం 25 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, సీఎం మనసు మార్చి తమ డిమాండ్లు పరిష్కారయ్యేలా దీవించమ్మా.. అంటూ అంగన్వాడీలు శుక్రవారం చెంగాళమ్మ తల్లిచెంత వినతిపత్రం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు నుంచి ర్యాలీగా చెంగాళమ్మ ఆలయం వద్దకు వెళ్లి సీఎం మనసు మార్చాలంటూ పూజలు చేసి అమ్మవారిని వేడుకొన్నారు. వీరికి సీఐటీయూ నేతలు లక్ష్మయ్య, మనోహర్, పద్మనాభం సంఘీభావం తెలిపారు.

గూడూరు: పట్టణంలోని గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 25వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీలు గొబ్బిళ్లు ఆడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఇంద్రావతి, ప్రభావతి, ప్రసన్న, మునికుమారి, లక్ష్మి, హైమావతి, మంగమ్మ, సుబ్బమ్మ, శివకుమార్, ప్రసాద్, సురేష్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కోట: న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం మూడు వారాలుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం అణగదొక్కే ప్రయత్నం చేస్తోందని వర్కర్లు, హెల్పర్లు ధ్వజమెత్తారు. కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట శుక్రవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నిరసన తెలిపారు.

నాయుడుపేట టౌన్: తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న అంగన్వాడీలు శుక్రవారం గేయాలు పాడుతూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, సీఐటీయూ నాయకుడు ముకుంద, అంగన్వాడీ సంఘ నాయకురాలు సంధ్య, మేరీ, ప్రమీల, నాగమ్మ, చెంగమ్మ, సుదర్శన, కళావతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం



నాయుడుపేటలో చెవులు మూసుకుని పారిశుధ్య కార్మికుల నిరసన

గూడూరు, జనవరి 5: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 11వ రోజు కొనసాగింది. దీక్షా శిబిరంలో పారిశుధ్య కార్మికులు పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ తమకు ఇచ్చిన హమీలను నెరవేర్చేవరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో గోపినాథ్, శివకుమార్, టీవీ.రమణయ్య, రమేష్, కోటేశ్వరరావు, ప్రభావతి, పెంచలమ్మ, లక్ష్మి, వరలక్ష్మి, మణెమ్మ, పెంచలప్రసాద్, మురళి పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం వద్ద తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలంటూ కార్మికులు నిరసన తెలిపారు. కార్మికుల బాధలు ప్రభుత్వానికి పట్టడం లేదని యూనియన్ నాయకుడు రామయ్య విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జీతాలు పెంచి సమస్యలను పరిష్కరించేందుకు చొరవతీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మనోహర్, అల్లెయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం సమ్మె నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులు శుక్రవారం చెడు వినకు... చెడు చూడకు... చెడు మాట్లాడకు అంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు చాపల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు 11 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరించడం సబబుకాదన్నారు. ఇకనైనా పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

వెంకటగిరి: మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె 11వ రోజు కొనసాగింది. మున్సిపల్ కార్యాలయంలో ఉన్న చెత్త ట్రాక్టర్లను ప్రైవేట్ కార్మికులతో బయటకు తీసేందుకు అధికారులు ప్రయత్నం చేయడంతో సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకొన్నారు. తమ సమస్యలు పరిష్కరించకుండా ప్రైవేట్ కార్మికులతో పారిశుధ్య పనులు చేపట్టడం తగదంటూ నినాదాలు చేశారు. వడ్డిపల్లి చెంగయ్య, కల్లూరి జాన్ తదితరులు పాల్గొన్నారు.